'సైక్లోన్ ఫైటర్స్'కు సీఎం అభినందన

కాకినాడసిటీ/సర్పవరంజంక్షన్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ సమయంలో అత్యుత్తమ సేవలందించిన వారికి రాష్ట్ర ప్రభుత్వం శనివారం సీఎం క్యాంపు కార్యాలయంలో అభినందన కార్యక్రమం నిర్వహించింది. కార్యక్రమంలో సీఎం చంద్రబాబు సైక్లోన్ ఫైటర్లకు సర్టిఫికెట్లు, మెమెంటోలు బహూకరించారు. ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబుకు ప్రశంసాపత్రం, సర్టిఫికెట్ అందజేశారు. లోతట్టు ప్రాంతాల్లోఉన్న ప్రజలను పునరవాస కేంద్రాలకు చేర్చడం, జోరు వానలోను అధికారయంత్రాంగంతో సమన్వయంతో విశేష సేవలందించినందుకు కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీకి సైక్లోన్ ఫైటర్ పురస్కారాన్ని అందజేశారు. జిల్లా మత్స్యశాఖ అధికారి కృష్ణారావుకు సర్టిఫికెట్, మెమెంటో అందజేశారు.



సీఎం చంద్రబాబు నుంచి పురస్కారాలు అందుకుంటున్న ఎమ్మెల్యే పంతం నానాజీ, రాజ్యసభ సభ్యుడు సానా సతీష్, జిల్లా మత్స్యశాఖ అధికారి కృష్ణారావు

వేళంగిలో ఘనంగా పెద్ద ఏనుగుల సంబరం


కరప మండలం వేళంగిలో విద్యుత్ వెలుగులతో ఊరేగింపునకు సిద్ధంగా ఉన్న ఏనుగు ప్రతిమ 7

దొంగల..హోల్‌సెల్!

- కాకినాడలో చోరీ సెల్‌ఫోన్ల రికవరీ
- బాధితులకు 800 ఫోన్లు అందజేసిన కాకినాడ జిల్లా ఎస్పీ


సెల్‌ఫోన్లను చూపిస్తున్న ఎస్పీ బిందుమాధవ్

చూడు.. దేవుడా!?



ప్రాణాలతో చెలగాటమే

- ఉమ్మడి జిల్లాలో పలు ఆలయాలు
- అంతంతమాత్రంగా క్యూలైన్లు
- రద్దీ పెరిగితే..తప్పదు ముప్పు
- కార్తీకమాసం.. కానరాని ఏర్పాట్లు
- ఆదాయమున్నా.. సౌకర్యాలు సున్నా
- కాశీబుగ్గ ఘటనతో ఉలికిపాటు

చూడు..దేవుడా ఎంత పని జరిగిందో.. నిన్ను చూద్దామని వస్తే.. నీ దగ్గరికే తీసుకెళ్లిపోయావు.. ఎవరిది తప్పయినా.. ఎవరిది నిర్లక్ష్యమైనా ఏమీ చేయలేని పరిస్థితి.. అసలే కార్తీకమాసం.. ఆలయాల్లో తాకిడి భారీగా ఉంటున్న తరుణంలో శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ ఆలయంలో జరిగిన తొక్కిసలాటలో తొమ్మిది మంది దుర్మరణం చెందిన ఘటన భక్తులను ఉలిక్కిపడేలా చేసింది. ఎందుకంటే ఆ శివారు అంతర్వేది నుంచి ఈ శివారు అన్నవరం వరకు, వాడపల్లి నుంచి పెద్దాపురం తొలి తిరుపతి వరకు భక్తుల రద్దీ అంచనాలకు మించి ఉంటోంది. కాశీబుగ్గ ఘటనతో ఉమ్మడి తూర్పుగోదావరి వ్యాప్తంగా తక్షణం అప్రమత్తం కావాల్సిన అవసరాన్ని నొక్కిచెబుతోంది.



(ఆంధ్రజ్యోతి -కాకినాడ)

ఉమ్మడి జిల్లాలో ప్రముఖ ఆలయాల దగ్గర నుంచి ప్రైవేటు వ్యక్తుల ఆధీనంలోని దేవాలయాల వరకు భారీగా భక్తులు పోటెత్తితే తట్టుకునే క్యూలైన్ల సామర్థ్యం లేదు. కేవలం గర్భగుడికి కొంచెం సమీపంలో మినహా ఎక్కడా బలమైన రైలింగ్‌లు ఉండవు. దీంతో సజావుగా జరగాల్సిన దర్శనాలు అనుకోని ఘటనలు జరిగితే ఎక్కడ ఏ ప్రమాదం తెచ్చిపెడతాయోనన్న భయం వ్యక్తమవుతోంది. అసలే కార్తీకమాసం కావడంతో వాడపల్లి వెంకన్న ఆలయం మొదలు అన్నవరం, అంతర్వేది, పెద్దాపురం తొలి తిరుపతి తదితర ఆలయాలకు అంచనాలకు మించిన భక్తులు పోటెత్తుతున్నారు. కానీ వీటిలో క్యూలైన్ల రక్షణ వ్యవస్థ చూస్తే అంతంత మాత్రమే. అటు ప్రైవేటు వ్యక్తుల ఆధీనంలోని ఆలయాలకు ఇటీవల అనూహ్యంగా భక్తులు పోటెత్తుతున్నారు. తాజా ప్రమాద ఘటనతో ప్రైవేటు నిర్వహణలో ఉన్న ఆలయాలపైనా దేవదాయశాఖ తక్షణం దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

వాడపల్లి వెళ్లినా ఇబ్బందే!



ఆత్రేయపురం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి ప్రతి శనివారం సుమారు 50 వేల నుంచి 60 వేల మంది భక్తులు వస్తున్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా క్యూలైన్లను విస్తరించినా అప్పుడప్పుడు తోపులాటలు జరుగుతున్నాయి. క్యూలైన్లలో భక్తులకు ఏదైనా అత్యవసర పరిస్థితి వస్తే బయటకు వచ్చే మార్గం లేక ఇబ్బందులేర్పడుతున్నాయి. ముఖ్యంగా ఫైర్ సేఫ్టీ పరికరాలు ఆలయంలో కానరావడం లేదు. ఆలయ ప్రాంగణంతో పాటు అన్నదానం నిర్వహించే ప్రదేశాలు రద్దీగానే ఉంటాయి. మరింత కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

రత్నగిరి..రద్దీకి ఏర్పాట్లేవి?

అన్నవరం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): సత్యదేవుడి ఆలయంలోనూ భక్తుల రద్దీ నియంత్రణపై అప్రమత్తంగా వ్యవహరించాల్సి ఉంది. ఈనెల 5న సత్యదేవుడి గిరిప్రదక్షిణ జరగనుంది. ప్రతి ఏటా స్వామివారి గిరిప్రదక్షిణ పల్లకీసేవ, సత్యరథం ఒకేసారి జరిగేవి. దీంతో భక్తులు ఒకేసారి పశ్చిమ రాజగోపురం వద్ద ఉండిపోవడంతో రద్దీ నియంత్రించలేక పశ్చిమ రాజగోపురం తలుపులు మూసివేసిన ఘటనలు జరిగాయి. ఈ ఏడాది సత్యదేవుడి గిరిప్రదక్షిణ పల్లకిలో ఉదయం 8 గంటలకు.. సత్యరథంతో భక్తులు పాల్గొనేందుకు మధ్యాహ్నం 2గంటలకు గిరిప్రదక్షిణ నిర్వహించాలని నిర్ణయించారు. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది మధ్యాహ్నం సత్యరథం వెంబడి గిరిప్రదక్షిణ అనే విషయం భక్తుల్లోకి పూర్తిగా చేరకపోవడంతో వారంతా ఉదయం పల్లకీ వెంట గిరిప్రదక్షిణకు సిద్ధమవుతున్నారు. దీంతో మధ్యాహ్నం 12 గంటల నుంచి రత్నగిరిపై విపరీత రద్దీ ఉండే అవకాశాలున్నాయి. 2 లక్షల మంది భక్తులు విచ్చేస్తారని అంచనా.

పంచారామాల్లో పట్టించుకోండి..

ద్రాక్షారామ/సామర్లకోట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పంచారామాల్లో భక్తుల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేయాల్సి ఉంది. జిల్లాలో పంచారామ క్షేత్రాలు రెండు ఉన్నాయి. ద్రాక్షారామ భీమేశ్వరస్వామి, సామర్లకోట కుమారరామ భీమేశ్వరాలయాలు ఉన్నాయి. ద్రాక్షారామలో కార్తీకమాసం ఆరంభం నుంచి ఉచిత దర్శనం క్యూలైను తూర్పుగోపురం నుంచి ఏర్పాటు చేశారు. ప్రత్యేక దర్శనం రూ.50, విశిష్ట దర్శనం రూ.10 క్యూలైన్లు మార్పులు చేశారు. రూ.50 దర్శనం లైన్లు అంతరాలయంలోకి ప్రవేశం నిలిపివేశారు. మొదటి గుమ్మం నుంచి దర్శనం చేసుకునేలా ఏర్పాటుచేశారు. రెండు చోట్ల భక్తుల రద్దీని నియంత్రించేందుకు కట్టుదిట్టమైన భద్రత చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

తొలి తిరుపతి ఇబ్బందే మరి?

పెద్దాపురం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): పెద్దాపురం మండలం దివిలిలో ఉన్న తొలి తిరుపతి శృంగార వల్లభస్వామి ఆలయానికి భక్తులు పెద్దఎత్తున వస్తుంటారు. ప్రతీ శనివారం స్వామి దర్శనానికి సుమారు 8 వేల నుంచి 10 వేల మంది భక్తులు వస్తారు. అయితే భక్తులకు సౌకర్యాలు మాత్రం అంతంత మాత్రంగానే ఉన్నాయి. 2022 నవంబరులో ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారి దర్శనానికి పోటెత్తడంతో ఆలయం లోపల తొక్కిసలాట జరిగింది.దీంతో పలువురు భక్తులు గాయపడ్డారు. భక్తులను నియంత్రించేందుకు ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులను ఏర్పాటు చేసినా ఆలయ పరిసరాలు ఇరుకుగా ఉండడంతో కొంత ఇబ్బందికర పరిస్థితి ఉంది.

అంతర్వేదిలో అత్యవసర ద్వారాల్లేవ్!

అంతర్వేది, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): దక్షిణ కాశీగా పేరొందిన అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి రోజురోజుకు భక్తుల తాకిడి ఎక్కువగా ఉంటోంది. విశేషమైన రోజుల్లో లక్షలాది మంది భక్తులు స్వామిని దర్శించుకుంటూ ఉంటారు. మాఘమాసంలో జరిగే స్వామివారి కల్యాణానికి, కార్తీకమాసంలో స్వామిని దర్శించుకునేందుకు సుదూర ప్రాంతాల నుంచి లక్షలాది మంది భక్తులు వస్తుంటారు. భక్తుల సౌకర్యార్థం ఆలయంలో ప్రత్యేక కూలైన్లు ఏర్పాటు చేశారు. అయితే ఎమర్జెన్సీ ఎగ్జిట్‌లు ఆలయానికి లేకపోవడంతో ఇబ్బంది ఉంది.

క్యూలైన్లు లేవు.. పవన్ సారూ..

(ఆంధ్రజ్యోతి-పిఠాపురం)

డిప్యూటీ సీఎం పవన్ నియోజకవర్గం పిఠాపురంలో ప్రధాన ఆలయాలకు క్యూలైన్లు లేవనే చెప్పాలి. పాదగయలోని కుక్కుటేశ్వరస్వామి ఆలయ ఆవరణలోనే క్యూలైన్లు 400-500 మంది భక్తులు వస్తే నిండిపోతాయి. పర్వదినాల్లో 10 వేల నుంచి 25 వేల మంది భక్తులు పాదగయ పుష్కరిణిలో పుణ్యస్నానాలకు, కుక్కుటేశ్వర స్వామి, శక్తి పీఠం పురుహూతికా అమ్మవారి దర్శనానికి వస్తుంటారు. మహాశివరాత్రి పర్వదినాల్లో సంఖ్య లక్షల్లో ఉంటుంది. ఇందుకు తగ్గట్టుగా ప్రస్తుతం ఏర్పాట్లు లేవు.

తుఫాన్‌కు 41,802 ఎకరాల్లో పంటనష్టం


వరి పొలాలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి

ప్రత్తిపాడు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మొంథా తుఫాన్ ప్రభావం కారణంగా 20 మండలాల్లో 41,802 ఎకరాల్లో పంటనష్టం వాటిల్లిందని జిల్లా వ్యవసాయాధికారి విజయ్‌కుమార్ తెలిపారు. ప్రత్తిపాడులో దెబ్బతిన్న వరిపంటలను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయాధికారి మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 20 మండలాల్లో పంట నష్టాల ప్రాథమిక అంచనాలు రూపొందించినట్లు తెలిపారు. ఇక సమగ్ర పంట నష్టం వివరాల సేకరణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొంథా తుఫాన్ కారణంగా జిల్లాలో వరి, పత్తి, మొక్కజొన్న, అపరాలు కూరగాయల పంటలకు నష్టం వాటిల్లిందన్నారు. తుఫాన్ వల్ల దెబ్బతిన్న పంటలను కాపాడుకునేందుకు రైతులు చేపట్టాల్సిన చర్యలను వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి జోకా అమృత పాల్గొన్నారు.

రేపు కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్

కలెక్టరేట్(కాకినాడ),నవంబరు1(ఆంధ్రజ్యోతి):ఈనెల3న కలెక్టరేట్‌లో ప్రజాఫిర్యాదుల పరిష్కారవేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు.ఈమేరకు ఒకప్రకటన వెలువరించారు. ఉదయం10గంటలనుంచిమధ్యాహ్నం ఒంటిగంటవరకు అర్జీలు స్వీకరిస్తారన్నారు.

డీఎంవోగా ప్రభాకర్ బాధ్యతల స్వీకరణ



జీజీహెచ్(కాకినాడ), నవంబరు 1(ఆంధ్రజ్యోతి): జిల్లా మలేరియా అధికారి(ఇన్‌చార్జ్)గా డాక్టర్ ఇంజేటి ప్రభాకర్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఆ స్థానంలో పనిచేసిన డాక్టర్ పి.విల్సన్ కాకినాడ పోర్టు వైద్యాధికారిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రభాకర్ మాట్లాడుతూ అపరిశుభ్రత వల్ల వచ్చే వ్యాధులనుంచి కీటకజనిత వ్యాధులనుంచి రక్షణ పొందేందుకు, ఆరోగ్యంగా ఉండేందుకు పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత, నిల్వ ఉన్న వ్యర్థ పదార్థాలు తొలగించడం ద్వారా అంటువ్యాధుల వ్యాప్తిని నివారించవచ్చన్నారు. జిల్లాలోని ప్రతి ఆరోగ్య ఉపకేంద్రాలు పారిశుధ్యం, ఫ్రైడే, డ్రైడే కార్యక్రమం ప్రతి శుక్రవారం క్రమం తప్పకుండా అమలు చేయాలన్నారు. ముఖ్యంగా సీజనల్ వ్యాధులైన ప్రాణాంతక వ్యాధులు డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యాడయేరియా వంటి వ్యాధుల నివారణా చర్యలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలన్నారు. అధికారులు,సిబ్బంది సమన్వయంతో మలేరియా రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషిచేస్తానన్నారు. బాధ్యతలు చేపట్టిన ప్రభాకర్‌ను డీఎంహెచ్‌వో కార్యాలయఅధికారులు అభినందించారు.

దురలవాట్లకు లోనై... గంజాయి రవాణా చేస్తున్న నలుగురి అరెస్ట్ 7

నేడు సత్యదేవుడి తెప్పోత్సవం 7

హాట్ హాట్.. ఈట్‌స్ట్రీట్



- కాకినాడలో కొత్తగా మరిన్ని ఈట్‌స్ట్రీట్‌లు
- ఒక్కోటి రూ.50లక్షలతో నిర్మించేలా ప్రణాళిక
- అనుకూలమైన స్థలాలు ఎంపిక చేయాలని కలెక్టర్ ఆదేశాలు
- రెండు నుంచి మూడు వరకు కొత్తవి ఏర్పాటుకు కసరత్తు
- ఇప్పటికే పీఆర్ కాలేజీ రోడ్డులో కొనసాగుతోన్న ఈట్ స్ట్రీట్
- జనం నుంచి ఆదరణ పెరుగుతుండడంతో కొత్తగా ఏర్పాటుకు నిర్ణయం

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

చికెన్ బిర్యానీ.. మటన్ బిర్యానీ.. కీమా బిర్యానీ.. అరకులో ప్రసిద్ధిచెందిన బొంగు చికెన్.. రాయల సీమలో పేరొందిన రాగిసంగటి.. నాటుకోడి పులుసు..వేడివేడి దోసెలు.. పెసరట్లు.. ఒకటేంటి ఆహార ప్రియుల జిహ్వాచాపల్యాన్ని తీర్చే రకరకాల నాన్‌వెజ్ వంటకాలతో కాకినాడ నగరంలో మరిన్ని ఈట్‌స్ట్రీట్‌లు ఏర్పాటుకు రంగం సిద్ధమవుతోంది. ఒక్కోటి రూ.50లక్షల అంచనా వ్యయంతో మరిన్ని స్టాల్స్ ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈమేరకు ఎక్కడెక్కడ వీటిని ఏర్పాటు చేయాలనేదానిపై మూడు నుంచి నాలుగు అనుకూల ప్రదేశాలు పరిశీలిస్తున్నారు. నగర ప్రజల ఆహార అలవాట్లు, అభిరుచులకు తగ్గట్టుగా రకరకాల దేశీయ నాన్‌వెజ్ వంటకాలతో 50వరకు ఈ ఈట్‌స్ట్రీ ట్‌లో స్టాళ్లు ఏర్పాటు చేయనున్నారు. నగరంలో నాగమల్లితోట జంక్షన్‌నుంచి ఆర్‌టీవో కార్యాలయానికి వెళ్లే రోడ్డులో జేఎన్‌టీయూ ఇండోర్ స్టేడియం నుంచి జిల్లా క్రీడాభివృద్ధి సంస్థ(డీఎస్‌ఏ) స్టేడియం వరకు గతంలో కొత్త ఈట్‌స్ట్రీట్ ప్రతిపాదించారు. కానీ గత వైసీపీ సర్కారు పట్టించుకోలేదు. వాస్తవానికి ఈ రహదారి నిత్యం రద్దీగా ఉంటుంది. ఎన్‌ఎఫ్‌సీఎల్, కోరమండల్, కాకినాడపోర్టు, ఉప్పాడ వెళ్లే వారంతా దాదాపు ఈరహదారిపై నుంచే ప్రయాణిస్తుంటారు. అనేక కంపెనీల ఉద్యోగులు, కార్మికులు రాత్రి షిఫ్టులకు, రాత్రి 8గంటలకు డ్యూటీ ముగించుకుని ఇంటికి వెళ్లే వారంతా ఈ దారిపైనే రాకపోకలు సాగిస్తుంటారు. దీంతో వీరందరి కోసం ఇప్పటికే ఈ రోడ్డులో అనేక బైక్ హోటళ్లు, వ్యాను హోటళ్ల రకరకాల టిఫిన్లు, నాన్‌వెజ్ వంటకాలు విక్రయిస్తున్నాయి. పైగా ఈ వ్యాపారానికి డిమాండ్ కూడా భారీగా ఉంటోంది. ఈ నేపథ్యంలో ఇక్కడ ఈట్‌స్ట్రీట్ అభివృద్ధి చేస్తే ఆదరణ చాలా ఎక్కువగా ఉంటుందని కార్పొరేషన్ అధికారులు అంచనా వేశారు. అందులో భాగంగా ఈట్‌స్ట్రీట్ నిర్మాణానికి టెండర్లు పిలిచినా కార్యరూపం దాల్చలేదు. ఈనేపథ్యంలో పాత ప్రతిపాదనలకు మళ్లీ ఇప్పుడు బూజులు దులుపుతున్నారు. ఈరహదారిలో ఇరువైపులా యాభై వరకు వివిధ స్టాళ్లు ఏర్పాటు చేసుకోవడానికి వీలుగా ప్రత్యేక ఫుట్‌పాత్‌లు, దారిపొడవునా ఉన్న చెట్లపై రకరకాల విద్యుత్ లైటింగ్, సీటింగ్ బెంచీలు, ఈట్‌స్ట్రీట్ సింబల్‌తో కూడిన సైన్‌బోర్డులు ఏర్పాటు చేయనున్నారు. సాయంత్రం నుంచి రాత్రి పది వరకు ఇక్కడ టిఫిన్లు, స్నాక్స్, బిర్యానీలతోపాటు రకరకాల అయిటంలు విక్రయించనున్నారు. ఇదికాకుండా నగరంలో ఈట్‌స్ట్రీట్‌లకు చాలినంత స్థలం ఉన్న ప్రదేశాలను ఎంపిక చేయాలని ఇటీవల కలెక్టర్ ఆదేశించడంతో త్వరలో కార్పొరేషన్ అధికారులు స్థలాల అన్వేషణ చేయనున్నారు. కాకినాడ నగరంలో ఇప్పటికే పీఆర్‌కాలేజీ రోడ్డులో ఈట్‌స్ట్రీట్ కొనసాగుతోంది. నాలుగేళ్ల కిందట రూ.1.52కోట్లతో కార్పొరేషన్ దీన్ని అభివృద్ధి చేసింది. వాస్తవానికి నగరంలో గడచిన కొన్నేళ్లుగా రకరకాలవెరైటీ వంటకాలు విక్రయించే వ్యాపారులకు మంచి ఆదరణ లభిస్తోంది. ముఖ్యంగా వారాంతాల్లో కుటుంబాలు రోడ్డుపక్కన బైక్,వ్యాన్,కారులో నిర్వహించే బార్బీ క్యూలకు క్యూ కడుతున్నారు. బయట హోటళ్లతో పోల్చితే వీటివద్ద రుచి,శుచి కూడా బాగుండడం, అటు జీఎస్టీ బాదుడు కూడా లేకపోవడంతో వీటికి ఆదరణ పెరుగుతోంది. దీంతో నగర ప్రజలకు మరింతగా నైట్‌లైఫ్‌తో కూడిన నాన్‌వెజ్,వెజ్ వంటకాలను స్టాళ్ల ద్వారా అందించేలా ఈట్‌స్ట్రీట్‌లను కార్పొరేషన్ అభివృద్ధి చేస్తోంది.

ఉధృతంగానే ఏలేరు వరద

- కాలువలకు మరో రెండు గండ్లు
- ముంపులో కొనసాగుతున్న పంటపొలాలు
- ప్రవాహానికి అడ్డంకిగా మారిన కూలిన చెట్లు


పిఠాపురం-గొల్లప్రోలు మధ్య ఏలేరు వరద ప్రవాహం

పిఠాపురం/గొల్లప్రోలు/ఏలేశ్వరం,నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఏలేరు వరద ఉధృతి కొనసాగుతోంది. కాలువల్లో ఎక్కడికక్కడ కూలిపోయిన చెట్లు ప్రవాహానికి అడ్డంకిగా మారాయి. మరో రెండుచోట్ల గండ్లు పడ్డాయి. పంటపొలాల్లో ముంపు కొనసాగుతోంది. ఇన్‌ఫ్లోస్ ఆకస్మికంగా పెరుగుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.ఏలేరు రిజర్వాయర్ నుంచి వరద నీటి జలాల విడుదలను కొనసాగిస్తుండడంతో పిఠాపురం, గొల్లప్రోలుప్రాంతాల్లో వరద ఉధృతి కొనసాగుతోంది. వరద నీటి ప్రవాహంతో పిఠాపురం, గొల్లప్రోలు ప్రాంతాల్లోని కాలువలకు ఐదుచోట్ల గండ్లు పడగా, శనివారం మరో రెండు చోట్ల గండ్లు పడ్డాయి. గండ్లునుంచి వస్తున్న నీరు పంటపొలాలు మీదుగా ప్రవహిస్తుండడంతో గొల్లప్రోలు, పిఠాపురం, ఇల్లింద్రాడ, మాధవపురం, బి.ప్రత్తిపాడు, భోగాపురం, రాపర్తి, పి.రాయవరం, సీతానగరం, లక్ష్మీపురం,గోకివాడ,నరసింగపురం, జములపల్లి తదితర ప్రాంతాల్లో 3వేల ఎకరాల్లోని పంటపొలాల్లో వరద ముంపు కొనసాగుతోంది. 216వ హైవేపై నీటిప్రవాహం తగ్గింది. పిడింరొడ్డి రెగ్యులేటర్ సమీపంలో ఆరుప్రాంతాల్లో చెట్లు కాలువల్లో కూలిపోయాయి.


ఇన్‌ఫ్లోస్‌తో తప్పని కలవరం

అల్లూరి సీతారామరాజు జిల్లాలోని క్యాచ్‌మెంట్ ఏరియాలో వర్షాలు పడుతుండటంతో ఇన్‌ఫ్లోస్ కొనసాగుతున్నాయి. రిజర్వాయర్‌లోకి వచ్చి చేరే జలాలు ఆకస్మికంగా తగ్గడం, అదేస్థాయిలో పెరుగుతుండడం రైతులను కలవరానికి గురిచేస్తోంది. శనివారం ఉదయం 6గంటలు నుంచి 11 గంటల వరకూ ఇన్‌ఫ్లోస్ 6,175 క్యూసెక్కులు ఉండగా, 11గంటల సమయంలో 11,650 క్యూసెక్కులకు పెరిగింది. మరలా గంటల వ్యవధిలో 6,175 క్యూసెక్కులకు తగ్గి స్థిరంగా కొనసాగుతోంది. ప్రస్తుతం ఏలేరు రిజర్వాయర్‌లో నీటిమట్టం 85.70మీటర్లు ఉండగా, నీటి నిల్వలు 22.36 టీఎంసీలు ఉన్నాయి. అవుట్‌ఫ్లోస్ మాత్రం రాత్రి వరకూ 6,175 క్యూసెక్కులుగా ఉన్నాయి. డీసీఆర్ స్లూయిజ్, స్పిల్ వే ద్వారా 6వేల క్యూసెక్కుల నీటిని కాలువలకు విడుదలచేస్తుండగా విశాఖ అవసరాలకు 175క్యూసెక్కులు పంపుతున్నారు.

'బల్లకట్టు, రెగ్యులేటర్లు ఆధునీకీకరిస్తాం'

పిఠాపురం/గొల్లప్రోలు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఏలేరు వరదల కారణంగా కాలువలకు పడిన గండ్లను యుద్ధప్రాతిపదికన పూడ్చేందుకు చర్యలు తీసుకోవాలని ధవళేశ్వరం ఇరిగేషన్ ఎస్ఈ గోపినాథ్ అధికారులను ఆదేశించారు. ఏలేరు, పీబీసీ నీటిసంఘాల ప్రతినిధులతో కలిసి ఆయన పిఠాపురం-గొల్లప్రోలు పట్టణాల మధ్య గల పిడింరొడ్డి రెగ్యులేటర్, గొల్లప్రోలు కాలువ తదితర ప్రాంతాల వద్ద ఏలేరు వరద ఉధృతిని, గండ్లను పరిశీలించారు. గొల్లప్రోలుబల్లకట్టు వద్ద ఏలేరు వరద ఉధృతిని పరిశీలించారు. బల్లకట్టు తొలగించి కొత్త నిర్మాణం చేపట్టేందుకు వీలుగా సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ అధికారులతో పరిశీలన చేయిస్తామని తెలిపారు. ఆర్ఆర్‌బీ చెరువు, పిడింరొడ్డి, నాగులాపల్లి రెగ్యులేటర్ల ఆధునీకరణకు తక్షణం అంచనాలు తయారు చేయాలన్నారు. గోదావరి డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ మురాలశెట్టి సునీల్‌కుమార్, ఏలేరు ప్రాజెక్టు కమిటీ వైస్‌చైర్మన్ ఊటా నానిబాబు ఉన్నారు.

పగలంతా కాంతి.. రాత్రికి విశ్రాంతి!



పగలంతా కాంతివం తంగా ప్రకాశించి.. రాత్రికి విశ్రాంతి తీసుకోవడానికి వెళ్తున్నట్టుగా సూర్యుడు అస్తమిస్తూ ఇలా కాకినాడ- సామర్లకోట రోడ్డులో శనివారం సాయంత్రం ఇలా కనిపించాడు. ఈ దృశ్యాన్ని ఆంధ్రజ్యోతి క్లిక్ మనిపించింది.

-ఆంధ్రజ్యోతి, కాకినాడ స్టాఫ్ ఫొటోగ్రాఫర్

అల'వేట' తప్పదు మరి!



సముద్రంలో పోటైనా.. పాటైనా.. అల..వేట అలవాటు మరి.. సాపాటు కోసం వల విసరడం చేపల కోసం వేటాడడం వారికి తప్పదు మరి.. ఓ మత్స్యకారుడు కాకినాడ-ఉప్పాడ రోడ్డు పక్కన ఇలా సముద్రంలో వేటాడుతూ కనిపించాడు.

-ఆంధ్రజ్యోతి, కాకినాడ స్టాఫ్ ఫొటోగ్రాఫర్

దొంగల..హోల్‌సెల్!

- కాకినాడలో చోరీ సెల్‌ఫోన్ల రికవరీ
- వాటి విలువ రూ.కోటి36లక్షలు
- ఇప్పటివరకు రికవరీ చేసినవి 3,351
- బాధితులకు ఫోన్లు అందజేసిన కాకినాడ జిల్లా ఎస్పీ

కొట్టేసిన ఫోన్‌లు 800



కాకినాడ జిల్లా పోలీసు కార్యాలయంలో రికవరీ చేసిన ఫోన్లను మీడియాకు చూపిస్తున్న జిల్లా ఎస్పీ బిందుమాధవ్, ఇతర పోలీసులు

ఒకటి కాదు.. రెండు కాదు.. వంద అంత కన్నా కాదు.. మొత్తం 3,351 మొబైల్ ఫోన్ల రికవరీ.. ఇప్పటివరకు కాకినాడ జిల్లా పోలీసులు పది విడతల్లో రికవరీ చేసిన మొబైల్ ఫోన్ల సంఖ్య ఇది. వీటి విలువ ఎంతో తెలుసా? రూ.5కోట్ల37లక్షల77వేలు.. ఇక పదో విడతలో భాగంగా శనివారం బాధితులకు అందజేసిన మొబైల్‌ఫోన్లు 800. వాటి విలువ రూ.కోటి36లక్షలు. ఇవి కేవలం చోరీకి గురై దొరికినవి మాత్రమే. దొరకనివి ఇంకా వేలల్లోనే ఉంటాయి.

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

కాకినాడ జిల్లాలో సెల్‌ఫోన్‌లు పోగొట్టుకున్న బాధితులకు పోలీసులు తిరిగి వాటిని అప్పగించారు. కాకినాడ జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం మధ్యాహ్నం జిల్లా ఎస్పీ బిందుమాధవ్ మీడియా సమావేశం ఏర్పాటు చేసి మీడియా ప్రతినిధుల సమక్షంలో మొబైల్ ఫోన్లను బాధితులకు అప్పగించారు. ఆపరేషన్ మొబీ ట్రాక్ కింద జిల్లా సైబర్ క్రైం పోలీసులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, నెట్‌వర్క్ నిఘా, డేటా విశ్లేషణ పద్ధతులు ఉపయోగించి భారీ మొబల్ రికవరీ ఆపరేషన్‌లో పాల్గొన్నారని జిల్లా ఎస్పీ వెల్లడించారు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా ఇప్పటివరకు పది విడతల్లో మొత్తం రూ.5,37,77,000 విలువైన 3,351 మొబైల్ ఫోన్లు రికవరీ చేసినట్టు వెల్లడించారు. పదోవిడతలో రూ.1,36,00,000 విలువ చేసే 800 మొబైల్ ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అప్పగిస్తున్నట్టు ఎస్పీ తెలిపారు. ఈ మేరకు ఎస్పీ కార్యాలయానికి వచ్చిన పలువురికి మొబైల్ ఫోన్లు అందజేశారు. ఐటీకోర్‌టీం ఉపయోగించిన ఎంఎంటీఎస్(మిస్సింగ్ మొబైల్ ట్రాకింగ్ సిస్టమ్), సీఈఐఆర్ ద్వారా వీటి రికవరీ సాధ్యమైందని ఎస్పీ తెలిపారు.

సెకండ్ హ్యాండ్ ఫోన్ కొంటున్నారా?

సెకండ్ హ్యాండ్ ఫోన్ కొనేటప్పుడు ఫోన్ బిల్లు, సెల్ ఫోన్ బాక్స్, ఫోన్ అమ్మే వ్యక్తి గురించి సరిగా పరిశీలించాలి. అపరిచితుల నుంచి ఫోన్లను కొనుగోలు చేయడం ద్వారా సైబర్ నేరాలకు గురయ్యే ప్రమాదం ఉంది.

ఫోన్ పోతే.. ఇలా చేయండి..

మొబైల్ మిస్సయిన సమయంలో తక్షణ చర్యగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను కాకినాడ జిల్లా ఎస్పీ వివరించారు.బ్యాంకు ఖాతాలను తక్షణమే బ్లాక్ చేయించాలి. సిమ్‌కార్డు నెంబర్‌ను ఆలస్యం చేయకుండా నిలిపివేయించాలి. గూగుల్‌పే, ఫోన్‌పే వంటి ఆర్థికపరమైన యాప్‌లు/ అప్లికేషన్లకు 2 ఫ్యాక్టర్ అథెంటికేషన్ లేదా బయోమెట్రిక్ సెక్యూరిటీ వినియోగించాలి. మొబైల్ పోయిన వెంటనే గూగుల్/ఆపిల్ ఐడీ, బ్యాంకింగ్ యాప్స్, వాట్సాప్, మెయిల్, సోషల్ మీడియా వంటి వాటి పాస్‌వర్డ్‌లు మార్చుకోవాలి.

●ఆండ్రాయిడ్ ఫోన్లకు ఫైండ్ మై డివైజ్, ఐ ఫోన్లకు ఫైండి మై ఐఫోన్(ఐక్లౌడ్) ఫోన్‌ను ట్రాక్ చేయడం, రింగ్ చేయడం, లాక్ చేయడం లేదా డేటా డిలీట్ చేయడం చేయాలి.

●సీఈఐఆర్.జీవోవీ.ఇన్ పోర్టల్‌ద్వారా లేదా కాకినాడ ప్రజలు మొబీ ట్రాక్ నెంబర్ 94906 17852కు వాట్సాప్ యాప్ హాయ్ లేదా హలో లేదా ఏదైనా మెసేజ్ పంపి తిరిగి మొబైల్‌కు వచ్చిన ఫైల్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు.

దొంగలు మాత్రం చిక్కడం లేదా?

వేలకొద్దీ సెల్‌ఫోన్లు పోవడం, వాటిలో కొన్నింటిని పోలీసులు రికవరీ చేసి బాధితులకు అప్పగించడం కొంతకాలంగా జరుగుతోంది. ఇంత పెద్దసంఖ్యలో ఫోన్లు చోరీ కావడం మాత్రం ఆందోళన కలిగిస్తోంది. సాధారణంగా మొబైల్ ఫోన్లను పోగొట్టుకోవడం తక్కువే. ఎక్కడో జేబులోంచి జారిపడడం, ఎక్కడైనా పడిపోవడమో, మరిచిపోవడం వంటి సమయంలో మొబైల్ ఫోన్లను కోల్పోతుంటారు. కొందరు ఫోన్‌లు చోరీ చేసేవారు ఉంటారు. ఇటీవల కాలంలో ఇలాంటి చోరులే అధికమయ్యారు. రూ.20, రూ.50 నోట్లను రోడ్డు మీద వేయడం.. వాటిని తీసుకోవడానికి ఎవరైనా ప్రయత్నించే క్రమంలో జేబులో ఉన్న ఫోన్లు కొట్టేయడం దొంగలకు అలవాటుగా మారింది. బైక్‌పై నుంచి పడిపోతున్నట్టుగా నటించడం, అది చూసి లేపుదామని వచ్చిన వారి జేబులో నుంచి వేరొక వ్యక్తి సెల్‌ఫోన్ కొట్టేయడం కొన్నిచోట్ల జరుగుతోంది. ఇలాంటి వారెవరూ పోలీసులకు చిక్కడంలేదు. వీటిని కొనుగోలు చేసి విక్రయిస్తున్న వారినీ పోలీసులు చూపడం లేదు. ఎవరైతే ఈ దొంగ మొబైల్స్ కొనుగోలు చేసి సిమ్ కార్డు వేసి వినియోగిస్తున్నారో వారి నుంచే రికవరీ చేస్తున్నారు. దొంగల వివరాలు మాత్రం చెప్పలేకపోతున్నారు.

'కర్పూర'కు డిమాండ్

- అరటిగెల ధర గరిష్ఠంగా రూ.600
- కళకళలాడుతున్న రావులపాలెం అరటి మార్కెట్ యార్డు
- పెరిగిన ఎగుమతులు.. అధిక శాతం ఒడిశాకే..



రావులపాలెం అరటి మార్కెట్ యార్డులో కర్పూర గెలలతో రైతులు

రావులపాలెం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం, తుఫాన్ ప్రభావం వంటి కారణాలతో కర్పూర రకం అరటి గెలలకు డిమాండ్ ఏర్పడింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం అరటి మార్కెట్ యార్డులో వీటికి గరిష్ఠంగా రూ.600 వరకు ధర పలుకుతోంది.

కోనసీమలో రైతులు కొబ్బరి, వరి తర్వాత. అరటిసాగు అధికంగా చేస్తుంటారు. అందులోను కర్పూర రకం ఎక్కువగా పండిస్తారు. ఈ రకాన్ని ఇతర రాష్ట్రాలకు కూడా ఎగుమతులు చేస్తుంటారు. ఇతర రాష్ట్రాల నుంచి వ్యాపారులు వచ్చిన సమయంలో ధరలు అనుకూలంగా ఉంటాయి. మూడు నెలలుగా హెచ్చుతగ్గులుగా ఉన్న కర్పూర రకం అరటి ధరలు వారంరోజులుగా పెరిగాయి. ఇతర రాష్ట్రాల నుంచి ఎగుమతులకు డిమాండ్ ఉండడంతో రోజురోజుకు ధరల పెరుగుదల కనిపిస్తోంది. ఒడిశాలో పౌర్ణమి రోజుతో కార్తీక మాసం ముగియడంతో అక్కడ కర్పూర రకం అరటిగెలలు వినియోగం బాగా పెరిగింది. దీంతో పూర్తిస్థాయిలో తయారైన గెలల నుంచి నాసిరకంలో ఉన్నవి సైతం వ్యాపారులు కొనుగోలు చేసి ఎగుమతులు చేస్తున్నారు.

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం అరటి మార్కెట్ యార్డుకు రైతులు సైకిళ్లు, మోటార్‌సైకిళ్లపై గెలలు తీసుకువచ్చి విక్రయాలు సాగిస్తుంటారు. కర్పూర రకం అరటిగెలలకు ఒడిశా ఎగుమతులకు డిమాండ్ పెరగడంతో మార్కెట్ యార్డుకు గెలలను అధికసంఖ్యలో రైతులు తీసుకువస్తున్నారు. దీంతో మార్కెట్ యార్డు రైతులు సైకిళ్లు, మోటార్‌సైకిళ్లు అరటి గెలలు వ్యాపారులతో కళకళలాడుతోంది. కొన్నిరోజులక్రితం కర్పూర రకం అరటి గెల రూ.150 నుంచి రూ.300 వరకూ మాత్రమే పలికింది. శనివారం అదే కర్పూర రకం అరటి గెల రూ.300 నుంచి నాణ్యమైన గెల రూ.650 వరకూ పలకుతుండడంతో రైతులు ఊరట చెందుతున్నారు. మొంథా తుఫాన్ ప్రభావంతో అరటి తోటలు గెల తయారీ దశలో కూడా నేలకొరిగాయి. దీంతో నాసిరకం గెలలు కూడా మార్కెట్‌కి వస్తుండగా వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. రావులపాలెం అరటి మార్కెట్ యార్డుకు శనివారం 20వేల అరటిగెలలు రాగా అందులో 15వేల గెలలు కర్పూర రకం కాగా చక్రకేళీ, తెలుపు, బూసావళి, కూర అరటి రకాలు 5వేల వరకు ఉంటాయి. వ్యాపారులు ఒడిషా, భువనేశ్వర్, కటక్, విశాఖపట్నం, తెలంగాణాతోపాటు పలు ప్రాంతాలకు వీటిని ఎగుమతి చేస్తుండగా నిత్యం 75 శాతం గెలలు ఒడిశాకే ఎగుమతవుతున్నాయి.

ఉప్పునీటితో కొబ్బరి తోటల్లో సంక్షోభం

డాక్టర్ యర్రంశెట్టి పరిశోధనా పత్రానికి అంతర్జాతీయ జర్నల్‌లో చోటు



ఎమ్మెల్యే వరప్రసాద్‌కు పరిశోధనా పత్రాన్ని చూపుతున్న సత్యప్రసాద్

మలికిపురం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గోదావరి డెల్టా వ్యవస్థలో అంతర్భాగమైన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కేశనపల్లి ప్రాంతం ఉప్పునీటి ప్రభావంతో ఎదుర్కొంటున్న పర్యావరణ, సామాజిక, ఆర్థిక సంక్షోభంపై డాక్టర్ విజయసత్యప్రసాద్ యర్రంశెట్టి పరిశోధనా పత్రానికి అంతర్జాతీయ జర్నల్‌లో చోటు దొరికింది. ఈ సందర్భంగా రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌కు పరిశోధనా పత్రాన్ని అందించారు. కేశనపల్లి కొబ్బరి తోటలకు సమస్యకు మూల కారణం శంకరగుప్తం మేజర్ డ్రెయిన్ ద్వారా ఉప్పునీరు ప్రవేశించడం, ఇది కేశనపల్లితో పాటు మరో తొమ్మిది గ్రామాల్లో కొబ్బరి, వరి పంటలకు తీవ్ర నష్టాన్ని కలిగించడంపై ఆయన పరిశోధన చేశారు. ఈ జర్నల్‌లో ప్రచురితమైన ప్రతులను ఎమ్మెల్యేకు అందించారు. ఉప్పునీరు లోపలికి వచ్చి సారవంతమైన వ్యవసాయ భూముల్లోకి చొచ్చుకుపోయి ఏర్పడిన జల సంబంధ దుర్భరత్వాన్ని వివరించారు. ఈ నష్టం బహుముఖంగా వినాశకరంగా ఉన్నట్టు నివేదించారు. కొబ్బరి వ్యవస్థ కుప్పకూలడం జీవనోపాధిని దెబ్బతీసిందని, గ్రామీణ కుటుంబాలపై తీవ్రమైన ఆర్థిక ఒత్తిడిని కలిగించిందని పరిశోధనలో వెల్లడించారు. సత్యప్రసాద్ పరిశోధనా పత్రాన్ని చేయడం పట్ల ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, స్థానిక సర్పంచ్ యెనుముల నాగు తదితరులు పాల్గొన్నారు.

శబరిమలకు పాదయాత్ర

కోనసీమ నుంచి కేరళకు పయనమైన ఐదుగురు అయ్యప్ప భక్తులు



బోడసకుర్రు మీదుగా శబరిమలకు పాదయాత్ర చేస్తున్న భక్తులు

అల్లవరం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం, ఉప్పలగుప్తం మండలాలకు చెందిన ఐదుగురు అయ్యప్ప భక్తులు మాలధారణతో కేరళ రాష్ట్రంలోని శబరిమల అయ్యప్పస్వామి ఆలయం వరకు శనివారం పాదయాత్ర ప్రారంభించారు. పీఠాల వద్ద పూజలు చేసి అల్లవరం మండలం మొగళ్లమూరి నుంచి భజరంగదళ్ మండల ప్రముఖ్ అల్లు అజయ్‌స్వామి శబరిమలకు శనివారం పాదయాత్ర ప్రారంభించారు. ఉప్పలగుప్తం మండలం బట్టుపాలేనికి చెందిన పోలిశెట్టి తిరుమలరావు, మీసాల హరీష్, నాగులపల్లి సతీష్, ఉప్పలగుప్తానికి చెందిన బద్రి నారాయణస్వామిలతో కలిసి అల్లు అజయ్‌స్వామి యాత్ర చేపట్టారు. 41వ రోజున దీక్ష ముగిసే వరకు యాత్ర కొనసాగుతుంది. కేరళలోని పంబా నది వద్ద ఇరుముడులు కట్టుకుంటామని, రోజుకు 30 నుంచి 40 కిలోమీటర్ల వరకు పాదయాత్ర కొనసాగుతుందన్నారు. పేరూరు వై-జంక్షన్ రామాలయం వద్ద అయ్యప్పభక్తులకు తెలుగు రైతు నాయకుడు ఆకుల లక్ష్మణరావు, యాళ్ల కాసుబాబు, వెంకటనారాయణ, ఈశ్వరరావు, అల్లు సత్తిబాబు, పిల్లా ప్రసాద్, కంకిపాటి సుబ్బారావు, కంకిపాటి గోపి స్వాగతం పలికారు.

యానాం నుంచి సైకిల్‌పై ..

యానాం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): యానాం నియోజకవర్గానికి చెందిన ఐదుగురు అయ్యప్ప భక్తులు కేరళ రాష్ట్రంలోని శబరిమలకు సైకిళ్లపై పయనమయ్యారు. వీరికి పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి సుమ రూ.50 వేలతో సైకిళ్లను సమకూర్చారు. ఈ సందర్భంగా శనివారం ఉదయం యానాం ఫెర్రిరోడ్డులోని దత్త మణికంఠస్వామి ఆలయంలో పూజల అనంతరం ఈ యాత్రను ఢిల్లీ ప్రతినిధి మల్లాడి సతీమణి ఉదయలక్ష్మి జెండా ఊపి ప్రారంభించారు.రూ.50 వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో యానాం ఓల్డేజ్ హోమ్ ప్రతినిధి పెనల గంగయ్య, మల్లాడి సత్తిబాబు, భీరస్వామి, కంచర్ల పెదబాబు, కొల్లు వీరబాబు, ఆకుల నాగేశ్వరరావు, భద్రం పాల్గొన్నారు.



యానాం నుంచి సైకిల్‌పై శబరిమల వెళ్తున్న భక్తులు

భక్తవత్సల.. గోవిందా

వాడపల్లి వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తజనం.. స్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి

ఆత్రేయపురం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి కార్తీక శనివారం ఏకాదశి కావడంతో భక్తజనం పోటెత్తారు. స్వామి వారికి ఆలయార్చకులు సుప్రభాతసేవ, నీరాజన మంత్రపుష్పం, ఐశ్వర్య లక్ష్మీహోమం, బాలభోగం తదితర కార్యక్రమాలను, శాస్త్రోక్తంగా నిర్వహించి వివిధ రకాల పుష్పాలతో అలకరించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు తిరువీధుల్లో ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. భారీ లైన్లలో స్వామిని దర్శించుకుని తులభారాలు, కానుకలు సమర్పించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్ వేగుళ్ల లీలాకృష్ణ సతీసమేతంగా స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. వారికి ఆలయ చైర్మన్ ముదునూరి వెంకట్రాజు స్వామివారి చిత్రపటం అందజేశారు. అలాగే మాజీ ఎమ్మెల్సీ బాబు రాజేంద్ర ప్రసాద్ స్వామివారిని దర్శించుకున్నారు. రాత్రి వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. వివిధ సేవల ద్వారా స్వామి వారి ఒక్కరోజు ఆదాయం రూ.62.53 లక్షలు లభించినట్టు ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. క్షేత్రపాలకుడు విశ్వేశ్వరస్వామి ఆలయాన్ని భక్తులు బారులుదీరి దర్శించుకున్నారు.

భక్తులతో కిక్కిరిసిన భీమేశ్వరాలయం



భీమేశ్వరస్వామి, బాలాత్రిపుర సుందరిదేవి

సామర్లకోట, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం ఏకాదశి సందర్భంగా శనివారం సామర్లకోట కుమారరామ భీమేశ్వరాలయం భక్తులతో కిక్కిరిసింది. తెల్లవారుజామున ఆలయ కార్యనిర్వహణాధికారి బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ధర్మకర్తల మండలి చైర్మన్ కంటే జగదీష్ మోహన్, మండలి సభ్యుల పర్యవేక్షణలో పండితులు వేదమంత్రోచ్చారణ మధ్య స్వామివారికి విశేష అభిషేకాలు, పూజలు, బాలాత్రిపుర సుందరిదేవికి పుష్పార్చన నిర్వహించారు. అనంతరం నూతన పట్టు వస్త్రాలతో స్వామి,అమ్మవార్లను సర్వాంగ సుందరంగా అలంకరించారు. మధ్యాహ్నం లక్షపత్రి పూజలు, సాయంత్రం ఆలయ ధ్వజస్తంభం వద్ద ఆకాశదీప పూజలు, రాత్రి ఆలయ ఆవరణలో దీపారాధన, సంఘం సభ్యులతో జ్యోతిర్లింగార్చన పూజలు నిర్వహించారు. ఆలయ నిత్యాన్నదాన పథకంలో సుమారు 1,200 మంది భక్తులు పాల్గొన్నారు. తూర్పు గోదావరి జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరావు దంపతులు, చిత్తూరు జిల్లా ఆర్డీసీ, కాణిపాకం వినాయకస్వామి ఆలయ ఈవో కిశోర్ దంప తులు భీమేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

18న రాజమహేంద్రవరానికి మంత్రి నారా లోకేశ్

టంగుటూరి అవార్డుల ప్రదానోత్సవంలో ఎమ్మెల్యే వాసు



విద్యార్థులకు అవార్డులు అందజేస్తున్న ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఈ నెల 18న రాజమహేంద్రవరం రానున్నారని, ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో కొత్తగా నిర్మాణం పూర్తిచేసుకున్న పలు భవనాలకు ఆయన ప్రారంభోత్సవం చేస్తారని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ వెల్లడించారు. శనివారం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలోని సెమినార్ హాలులో కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో టంగుటూరి ప్రకాశం పంతులు పేరుతో పీజీ సెట్-2025లో 1 నుంచి 100 లోపు ర్యాంకులు సాధించిన విద్యార్థులకు అవార్డుల ప్రదానోత్సవ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే వాసు మాట్లాడుతూ అవార్డులు పొందిన వారు మరింత మందికి ప్రోత్సాహాన్ని ఇవ్వాలన్నారు. నగరంలోని జేఎన్ రోడ్డులో ఆంధ్ర కేసరి పేరుతో ఉన్న కళాశాల జంక్షన్‌లో గత పాలకులు కప్పు సాసర్ ఏర్పాటు చేయడం దారుణమని, తాను త్వరలో అక్కడే 6 అడుగుల ఆంధ్ర కేసరి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తానని ప్రకటించారు. కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్కే, వైస్ ప్రిన్సిపాల్ మూర్తి, పూర్వవిద్యార్థుల సంఘం అధ్యక్షుడు ముళ్ల మాధవ్, ప్రతినిధులు సుధాకర్, భార్గవ్, విజయలక్ష్మి, వరప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

బీసీ రక్షణ చట్టం హామీని విస్మరించిన సీఎం

చినశంకర్లపూడిలో జీసీవై పార్టీ జాతీయ అధ్యక్షుడు రామచంద్రయాదవ్ విమర్శ



చినశంకర్లపూడిలో పర్యటిస్తున్న రామచంద్రయాదవ్

ప్రత్తిపాడు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సగానికి పైగా ఉన్న బీసీల ఓట్లతో అధికారంలోకి వచ్చిన సీఎం చంద్రబాబు ఎన్నికల్లో బీసీల రక్షణ చట్టం తీసుకొస్తామన్న హామీని విస్మరించారని బీసీవై పార్టీ జాతీయ అధ్యక్షుడు బొడే రామచంద్రయాదవ్ విమర్శించారు. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం చినశంకర్లపూడిలో శనివారం ఆయన పర్యటించారు. స్థానిక బీసీ సంఘర్షణ సమితి నియోజకవర్గ కన్వీనర్ ఏపూరి శ్రీనివాసరావు నివాసగృహంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. నూటి కి 50-55శాతం బీసీలు ఉన్నా సీఎం చంద్రబాబు బీసీల రక్షణకు అధికా రం చేపట్టి 16 నెలలు గడుస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు.గత ప్ర భుత్వంలో జరిగిన అరాచకాలు కంటే 10రెట్లు అరాచకాలు కూటమి ప్రభుత్వంలో జరుగుతున్నాయని ఆరోపించారు. బీసీలను అణచివేయడంలో వైసీపీ, టీడీపీలు పోటీ పడుతున్నాయని, ఈ రెండు పార్టీలకు తగిన శాస్తి చెప్పేలా ప్రజలు ముందుకు రావాలని కోరారు.రాబోయే స్థానిక ఎన్నికల్లో బీసీలు ఘన విజయం సాధించాలని, ఇందుకు బీసీల నియోజకవర్గం ప్రత్తిపాడునుంచే ఇది ప్రారంభం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నియోజకవర్గ బీసీ నేతలు ఏపూరి శ్రీను, గొంప శివకుమార్, లాయర్ శ్రీనివాసరావు, ఏపూరి సత్యనారాయణ పాల్గొన్నారు.

క్రీడా ప్రోత్సాహకాలకు దరఖాస్తుల ఆహ్వానం

కార్పొరేషన్(కాకినాడ), నవంబరు 1(ఆంధ్రజ్యోతి): జాతీయ, అంతర్జాతీయ క్రీడా పోటీల్లో అద్భుత ప్రతిభ కనబరిచి పతకాలు సాధించిన క్రీడాకారులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. నగదు ప్రోత్సాహక పథకం కింద అర్హులైన వారికి పారితోషకం అందించనున్నట్టు రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ(శాప్) ప్రకటించింది. దీంతో అర్హులైన క్రీడాకారులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి వి.సతీష్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రం గర్వించేలా పతకాలు సాధించిన క్రీడాకారులను ప్రోత్సహించే ఉద్దేశంతో ఈ పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తున్నట్టు తెలిపారు. అర్హులైన క్రీడాకారులు ఈ నెల 4వ తేదీ రాత్రి 11.59 గంటలకు లోపు దరఖాస్తులను sports.ap.gov.in/registration లింకు ద్వారా మాత్రమే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సతీష్‌కుమార్ పేర్కొన్నారు.

శాటిలైట్ ఇమేజ్ వెరిఫికేషన్‌తో
పంట నష్టం అంచనా
రాష్ట్రంలో పైలెట్ ప్రాజెక్టుగా రాయవరం మండలం ఎంపిక



రాయవరంలో సమావేశమైన పంటనష్టం అంచనాబృందం

రాయవరం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను వల్ల జరిగిన పంట నష్టం వివరాలను శాటిలైట్ ఇమేజ్ వెరిఫికేషన్ ద్వారా నమోదు చేసేందుకు రాష్ట్రంలో పైలెట్ ప్రాజెక్టుగా బాపట్ల, పల్నాడు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో రాయవరం మండలాన్ని ఎంపిక చేసినట్టు వ్యవసాయాధికారి కేవీఎస్ రమేష్‌కుమార్ తెలిపారు. శనివారం రాత్రి ఆయన మాట్లాడుతూ గ్రామ స్థాయిలో పంటనష్టం నమోదు(మాన్యువల్) వివరాలను శాటిలైట్ వెరిఫికేషన్(డిజిటల్) వివరాలతో సరిపోల్చేందుకు ఒక ప్రయత్నంలో భాగంగా ఈ కార్యక్రమానికి ఉన్నతాధికారులు శ్రీకారం చుట్టినట్టు చెప్పారు. మండలంలోని వి.సావరం, లొల్ల, సోమేశ్వరం, మాచవరం, పసలపూడి, చెల్లూరు, వెంటూరు, కురకాళ్లపల్లి గ్రామాల్లో పంటనష్టం వివరాలను డిజిటల్ వెరిఫికేషన్ ద్వారా నమోదు చేస్తారన్నారు. మండలంలోని పంట నష్టాన్ని అంచనా వేసేందుకు ఆలమూరు ఏడీఏ కేవీ చౌదరి ఆధ్వర్యంలో అధికారులు పర్యటించారన్నారు. గ్రామస్థాయిలో నమోదు చేసిన వివరాలను మండలాధికారులు ఫీల్డ్ వెరిఫికేషన్ జరిపారని చెప్పారు.

సత్యదేవుడి సన్నిధి.. విపరీతమైన రద్దీ

- ఆలయానికి పోటెత్తిన భక్తులు
- 8200 వ్రతాలు
- రూ.70 లక్షల ఆదాయం



ఆలయంలో వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు

అన్నవరం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): సత్యదేవుడి సన్నిధి శనివారం కార్తీక శుద్ధ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని అశేష భక్తజనంతో పోటెత్తింది. రద్దీని దృష్టిలో ఉంచుకుని ఒంటి గంట నుంచి వ్రతాలు, 2 గంటల నుంచి సర్వదర్శనాలు ప్రారంభించారు. భక్తులకు ఎక్కడా తోపులాటలకు ఆస్కారం లేకుండా అధికారులు పకడ్బందీ చర్యలు చేపట్టడంతో అసౌకర్యం కలగలేదు. రద్దీకి అనుగుణంగా అంత్రాలయ దర్శనాలను అనుమతించారు. విపరీతమైన రద్దీ సమయంలో అంత్రాలయ దర్శనం నిలుపుదల చేసి శీఘ్రదర్శనానికి అనుమతించారు. కొద్దిసేపు యంత్రాలయ దర్శనం తాత్కాలికంగా నిలుపుదల చేశారు. దేవస్థానం చైర్మన్ రోహిత్ పశ్చిమరాజగోపురం లిఫ్ట్‌వద్ద దళారులకు అవకాశం లేకుండా పర్యవేక్షించారు. వాహనాలన్నీ సత్యగిరి కొండపైకి మళ్లించడంతో ట్రాఫిక్ సమస్య రాకుండా చూశారు. స్వామివారి ఉచిత దర్శనానికి 3గంటలు, ప్రత్యేక దర్శనానికి 2గంటల సమయం భక్తులు వేచి ఉండాల్సి వచ్చింది. శనివారం ఒక్కరోజు 8,200 జంటలు స్వామివారి వ్రతమాచరించుకోగా వివిధ విభాగాల ద్వారా రూ.70లక్షల ఆదాయం లభించింది. ఈవో సుబ్బారావు వ్రత మండపాలు, క్యూలైన్లను పర్యవేక్షిస్తూ సిబ్బందికి సూచనలిచ్చారు.

రూ.1.80 లక్షల విరాళం

అన్నవరం దేవస్థానంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవా నిత్యాన్నదాన పథకానికి తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరానికి చెందిన రామ్ మాణిక్యం శనివారం రూ.1.80 లక్షలు విరాళం చైర్మన్ ఐవీ రోహిత్‌కు అందజేశారు. ఆయన దాతను అభినందించి వారికి స్వామివారి ప్రసాదం, ప్రత్యేక దర్శన సౌకర్యం కల్పించారు. పీఆర్వో అనకాపల్లి ప్రసాద్ పాల్గొన్నారు.



చైర్మన్‌కు విరాళం అందజేస్తున్న దాత

నేడు సత్యదేవుడి తెప్పోత్సవం


సాయంత్రం 5.45కి తులసి ధాత్రి పూజ, రాత్రి 7గంటలకు నౌకావిహారం

అన్నవరం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): సత్యదేవుడికి ప్రతిఏటా నిర్వహించే కీలకమైన ఉత్సవాల్లో ఒక్కటైన తెప్పోత్సవానికి ఆలయ యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. ఆదివారం రాత్రి 7గంటలకు స్వామి,అమ్మవార్లు పంపా సరోవరంలో నౌకావిహారయాత్ర చేయనున్నారు. ఇప్పటికే రంగురంగుల విద్యుద్దీపఅలంకరణలు ఏర్పాటు చేశారు. వేలాదిగా భక్తులు తిలకించేందుకు వీలుగా ప్రత్యేక వేదికను తీర్చిదిద్దారు. ప్రముఖులు వీక్షించేందుకు ప్రత్యేక వీఐపీ గ్యాలరీ, ఎల్‌ఈడీ స్ర్కీన్లు ఏర్పాటు చేశారు. స్వామి,అమ్మవార్లను ఆదివారం సాయంత్రం 4.30 గంటలకు కొండపై నుంచి మేళతాళాలతో పల్లకీలో పంపా సరోవర తీరం వద్దకు తీసుకువస్తారు. అక్కడ ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై ఆశీనులు గావించి అలంకరణ అనంతరం 5.45 గంటలకు తులసిధాత్రి పూజను నిర్వహించి 7గంటలకు నౌకావిహార యాత్రను నిర్వహిస్తారు. పెద్దాపురం డీఎస్పీ పర్యవేక్షణలో 100మందితో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.



సత్యదేవుడి తెప్పోత్సవానికి సిద్ధమైన హంస వాహనం

ఘనంగా పెద్ద ఏనుగుల సంబరం



విద్యుత్ అలంకరణతో ముస్తాబైన మెర్ల వారి ఏనుగు ప్రతిమ

కరప, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కరప మండలం వేళంగిలో శనివారం రాత్రి పెద్ద ఏనుగుల సంబరం ఘనంగా జరిగింది. నెలరోజుల క్రితం ఇదే గ్రామంలో చిన్న ఏనుగుల సంబరాన్ని నిర్వహించారు. మెర్ల, మార్ని వంశస్తుల సంబరంగా పేర్కొనే ఈ ఉత్సవంలో ఏనుగు ప్రతిమలను రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాల నడుమ ప్రత్యేక వాహనాలపై ఈ ఏనుగులను గ్రామంలో రాత్రి తెల్లవార్లు ఊరేగించారు. వివిధ రకాల సజ్జలు, భారీ బాణసంచా కాల్పులతో నిర్వాహకులు సంబరాన్ని రక్తి కట్టించారు. తెల్లవారుజామున ఎదురెదురుగా ఏనుగులను ఉంచి కనులపండువగా ఉత్సవాన్ని జరిపారు. ఈ సంబరాన్ని వీక్షించేందుకు వేలాది మంది తరలిరాగా ఏ అవాంఛనీయ ఘటనలు జరగకుండా కరప పోలీసులు బందోబస్తు నిర్వహించారు. అలాగే పెనుగుదురులో శనివారం రాత్రి వెంకన్నబాబు సంబరం ఘనంగా జరిగింది. స్థానిక శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని ఎమ్మెల్యే పంతం నానాజీ, మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, టీడీపీ నేతలు పిల్లి సత్తిబాబు, కటకంశెట్టి బాబి సందర్శించి స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

‘డైట్’లో ఉద్యోగాలకు దరఖాస్తు గడువు పెంపు

కాకినాడ రూరల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): అమరావతి పాఠశాల విద్యా సంచాలకుల ఉత్తర్వుల ప్రకారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని జిల్లా విద్యా శిక్షణా సంస్థ (డైట్) నందు డిప్యూటేషన్ పద్ధతిలో 2025-26కు గాను అర్హులైన పాఠశాల సహాయకుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్టు కాకినాడ జిల్లా డీఈవో పి.రమేష్ తెలిపారు. దీనికి సంబంధించిన గడువును ఈనెల 3వరకూ పొడిగించామని, అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రైలు ఢీకొని 30 గొర్రెలు మృతి



గొల్లప్రోలులో మరణించిన గొర్రెలు

గొల్లప్రోలు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు వద్ద శనివారం సాయంత్రం రైలు ఢీకొని 30కిపైగా గొర్రెలు మృతి చెందగా, మరో 12 గొర్రెలకు తీవ్రగాయాలయ్యాయి. సుద్దగడ్డ, ఏలేరు వరద నీరు ప్రవహిస్తుండడంతో బ్రిడ్జి కింద నుంచి వెళ్ల లేక గొల్లప్రోలుకు చెందిన గొర్రెల వెంకటరమణ తన గొర్రెలను రైల్వేట్రాక్ మీదుగా పొలంలో మేపేందుకు తీసుకెళ్తున్నాడు. అదే సమయంలో 2 ట్రాక్‌లపై ఒకే సమయంలో రైళ్లు రావడంతో బెదిరిపోయాయి. విజయవాడ వైపు నుంచి విశాఖపట్టణం వైపు వెళ్తున్న రైలు గొర్రెలను ఢీకొనడంతో 30 అక్కడిక్కడే మరణించాయి. మిగిలినవి గాయపడ్డాయి. ఈ ప్రమాదం కారణంగా రూ.7లక్షలు నష్టపోయాయని గొర్రెల వెంకటరమణ ఆవేదనచెందాడు.

అత్యాచార నిందితుడిపై రౌడీషీట్ తెరుస్తాం

నిందితుడిపై గతంలో నోట్లమార్పిడి, బైక్ చోరీ కేసులు : అమలాపురం డీఎస్పీ

ఐ.పోలవరం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): బాణాపురం అత్యాచార నిందితుడు రాయపురెడ్డి సత్యవెంకటకృష్ణ(బాబి)(45)పై రౌడీ షీట్ ఓపెన్ చేస్తామని అమలాపురం డీఎస్పీ టీఎస్‌ఆర్‌కే ప్రసాద్ తెలిపారు. ఇటువంటి తప్పుడు ప్రవృత్తి కలిగిన వ్యక్తులను జైలుకు పంపించి కఠినంగా శిక్షించవలసిన అవసరం ఉందన్నారు. శనివారం స్థానిక పోలీసు స్టేషన్‌లో మీడియా సమావేశంలో మాట్లాడారు. నిందితుడు నేర చరిత్ర కల్గిన వ్యక్తిగా పేర్కొన్నారు. నిందితుడిపై పోక్సో చట్టం 2012 ప్రకారం 2సెక్షన్లపై కేసు నమోదు చేశామన్నారు. బాధితురాలి బంధువులను విచారించామన్నారు. బాధితురాలితో కలిసి స్వయంగా నిందితుడి ఇల్లు, నిర్మాణంలో ఉన్న అతడి సోదరుని ఇల్లు పరిశీలించామన్నారు. బాధితురాలి వివరాల ప్రకారం సెప్టెంబరులో ఆరుసార్లు అత్యాచారం జరిగినట్టు గుర్తించామన్నారు. నిందితుడు వెంకటకృష్ణను అరెస్టు చేసి ముమ్మిడివరం కోర్టుకు తరలించామన్నారు. నిందితుడు ఐ.పోలవరం జడ్పీ హైస్కూల్ విద్యాకమిటీ కోఆప్షన్ సభ్యుడిగా ఉన్నాడన్నారు. వాలీబాల్ క్రీడలో నైపుణ్యం కల్గిన నిందితుడు స్కూల్‌లో విద్యార్థిని, విద్యార్థులకు శిక్షకుడిగా పనిచేసేవాడన్నారు. 2001లో నిందితుడిపై ఐ.పోలవరం స్టేషన్‌లో బైక్ చోరీ, 2005లో రాజానగరంలో దొంగ నోట్లు మార్పిడి కేసు నమోదైనట్టు తెలిపారు. సమావేశంలో ముమ్మిడివరం సీఐ ఎం.మోహన్‌కుమార్,ఎస్‌ఐ రవీంద్రబాబు ఉన్నారు.

రేపటి నుంచి డిప్యూటీ ఎంపీడీవోలకు శిక్షణ తరగతులు

సామర్లకోట, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాలకు చెందిన డిప్యూటీ ఎంపీడీవో సుమారు 200 మందికి ఈనెల 3 నుంచి 13 వరకూ శిక్షణ తరగతులు సామర్లకోట విస్తరణ శిక్షణా కేంద్రం ఆవరణలో ఉంటాయని ప్రిన్సిపాల్ ప్రసాదరావు వెల్లడించారు.

దురలవాట్లకు లోనై...

గంజాయి రవాణా చేస్తున్న నలుగురి అరెస్ట్

24 కిలోల గంజాయి స్వాధీనం



నిందితులను అరెస్ట్ చేసిన సర్పవరం పోలీసులు

సర్పవరం జంక్షన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో ఖాళీ భవనం వద్ద పోలీసులు ఆకస్మిక దాడి చేసి 24 కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని నలుగురు నిందితులను అరెస్ట్ చేశారు. ఇందులో ఇద్దరు మైనర్లు ఉండటం గమనార్హం. ఇందుకు సంబంధించిన వివరాలను శనివారం సర్పవరం పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వో బి.పెద్దిరాజు తెలిపారు. జిల్లా ఎస్పీ బిందుమాధవ్ ఆదేశాల మేరకు ఎస్‌డీపీవో పాటిల్ దేవరాజ్ మనీష్, సీఐ పెద్దిరాజు పర్యవేక్షణలో ఎస్‌ఐ పి.శ్రీనివాస్‌కుమార్ సిబ్బందితో కలసి వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు డిప్యూటీ తహశీల్దార్ సమక్షంలో ఏపీఐఐసీ ఖాళీ భవనంపై దాడులు నిర్వహించారు. అక్కడ కాకినాడ రూరల్ మండలం రమణయ్యపేట ఐశ్వర్యాంబిక ఆలయం సమీపానికి చెందిన 20 ఏళ్ల బులిపే అజయ్‌కుమార్ (అజయ్), ఇంద్రపాలెనికి చెందిన 19 ఏళ్ల అనపర్తి శివశంకర్ (గోంగలి), సీసీఎల్-1 17ఏళ్ల పెంకే వెంకట సత్యవరప్రసాద్ (ప్రసాద్), 17 ఏళ్ల కోరిమిల్లి సురేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. నలుగురి వద్ద తలో 6 కిలోలు వెరసి 24 కిలోలు (రూ.1.20 లక్షలు) విలువైన గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌హెచ్‌వో పెద్దిరాజు తెపారు. వీరంతా స్నేహితులని.. గంజాయి, సిగరెట్, మద్యం వంటి దురలవాట్లకు లోనై సులువుగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో గంజాయి రవాణా బాట పట్టారన్నారు. వీరు నర్సీపట్నం సమీపంలో గల ఏజెన్సీ ప్రాంతం నుంచి కిలో గంజాయి రూ.2 వేలుకు కొనుగోలు చేసి కాకినాడకు తీసుకువచ్చి విక్రయించి లాభాలు పొందాలనుకున్నారని తెలిపారు. నిందితుల్లో ఏ1,ఏ2 ఇద్దరిపై పూర్వ నేరచరిత్ర ఉందని, అజయ్ కుమార్ సామర్లకోట పీఎస్‌లో నిందితుడని, శివశంకర్ పలు కేసుల్లో నిందితుడన్నారు. మిగతా ఇద్దరు మైనర్లను రాజమహేంద్రవరం జువైనైల్ జస్టిస్ బోర్డుకు తరలించడం జరిగిందన్నారు. ఏ1, ఏ2 నిందితులను జ్యుడిషియల్ రిమాండ్‌కు తరలించామన్నారు. ఎక్కడైనా డ్రగ్స్ వాడకం, గంజాయి రవాణా, మత్తు పదార్థాల వ్యాపారం జరిగితే 112, 100కు సమాచారం అందించాలని కోరారు.

ఫోన్‌లో పబ్జీ గేమ్ ఆడుకుంటుండగా...

యువకుడిపై కత్తితో దాడి

అక్కడికక్కడే మృతి



మృతిచెందిన బాబ్జి

గండేపల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గండేపల్లి మండలం యర్రంపాలెంలో శుక్రవారం రాత్రి క్షణికావేశంలో ఓ వ్యక్తి యువకుడిపై కత్తితో దాడి చేయడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. యర్రంపాలెంలో కాకర చిన్ని అనే వ్యక్తి కొత్తగా ఇళ్లు కట్టుకుంటున్నాడు. అక్కడే గ్రామానికి చెందిన బొంగా బాబ్జి (17) అనే యువకుడు రాత్రి 11గంటల సమయంలో ఫోన్‌లో పబ్జీ గేమ్ ఆడుకుంటున్నాడు. గమనించిన చిన్ని అక్కడి నుంచి వె ళ్లిపోవాలని బాబ్జికి చెప్పాడు. అయినా వినకుండా బాబ్జి అక్కడే ఉండడంతో ఇద్దరి మధ్య మాటామా టా పెరిగింది. దీంతో ఆవేశంలో బాబ్జి పీక మీద చిన్ని కత్తితో దాడి చేయడంతో వెంటనే అతడు అక్కడికక్కడే మరణించాడు. సమాచారం అందు కున్న గండేపల్లి ఎస్‌ఐ యువీ శివనాగబాబు, డీఎస్పీ శ్రీహరిరాజు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పెద్దాపురం ప్రభుత్వాస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. దీనిపై గండేపల్లి ఎస్‌ఐ కేసు నమోదు చేయగా సీఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పూర్తిస్థాయిలో పరిహారాలు చెల్లిస్తాం..

- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు
- వేలేరుపాడులో పోలవరం నిర్వాసితులకు చెక్కుల అందజేత



సభలో మాట్లాడుతున్న మంత్రి నిమ్మల రామానాయుడు, ప్రజాప్రతినిధులు, తదితరులు

వేలేరుపాడు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రాజెక్టు నిర్మాణం వల్ల నష్టపోతున్న ప్రతీ ఒక్క నిర్వాసితుడికి పూర్తిస్థాయి పరిహారాలు ఇళ్ల నిర్మాణాలు చేసి అందించి వారిని సంతోషంగా ఉంచడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. పోలవరం భూసేకరణ, పునరావాసం నిర్వాసితుల సభ, పరిహారాల చెక్కులు అందించే కార్యక్రమాన్ని వేలేరుపాడు జూనియర్ కాలేజీ ఆవరణలో శనివారం జరపగా ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కొన్ని కారణాల కారణంగా పరిహారాల చెల్లింపులో అవరోధాలు ఏర్పడితే వాటిని పరిష్కరించేందుకు ప్రత్యేక గ్రీవెన్‌సెల్ ఏర్పాటు చేస్తామని పరిహారం రాని ఏ ఒక్కరు అధైర్యపడవద్దని భరోసా ఇచ్చారు. రాష్ట్రాభివృద్ధికి ప్రధాన మంత్రి నరేంద్రమోదీ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, ఐటీ మంత్రి నారా లోకేశ్ ఆహర్నిశలు పనిచేస్తున్నారని వారికి ప్రజల ఆశీస్సులు ఎప్పుడూ ఉండాలని కోరారు. అనంతరం నిర్వాసితులకు చెక్కుల పంపిణీ చేశారు.నిర్వాసితులను ఆదుకుంటున్న ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చిత్రపటాలకు ఎమ్మెల్యేలు, కూటమి నాయకులతో పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్ని నెరవేరుస్తోందన్నారు. పోలవరం నిర్వాసితులను జగన్ మోసం చేస్తే, కూటమి ప్రభు త్వం నిధులు విడుదల చేసి పరిహారాలు జమ చేస్తూ నిర్వాసితుల కళ్లల్లో వెలుగులు నింపుతోందన్నారు. ఆర్‌అండ్ఆర్ కమిషనర్ ప్రశాంతి, పోలవరం అడ్మిని స్ట్రేటర్ అభిషేక్, జేసీ అభిషేక్ గౌడ, ఆర్డీవో రమణ, వేలేరుపాడు, కుక్కునూరు మండలాల టీడీపీ అధ్యక్షులు అమరవరపు అశోక్, ములిశెట్టి నాగు, తదితరులు పాల్గొన్నారు.

రామారావు ఖాతాలో నగదు జమ

కూనవరం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పోలవరం నిర్వాసితులకు శనివారం నుంచి వారి ఖాతాల్లో డబ్బులు జమవుతున్నాయి. మండలంలో మొత్తం తొమ్మిది ప్రాధాన్యత గ్రామాలను గుర్తించారు. ఇందులో కూనవరం, టేకులబోరు, కొండ్రాజుపేట, శబరి కొత్తగూడెం, టేకుబాకా, కూళ్లపాడు, పెద్ద ఆర్కూర్, పంద్రాజుపల్లి, వాల్ఫర్‌పేట గ్రామాల్లో సర్వే నిర్వహించారు. అందులో భాగంగానే మండలంలో తొలి ఖాతాదారుడు మొట్టం రామారావు ఖాతాలో రూ.6,65,138 లక్షలు జమయ్యాయి. దీంతో నిర్వాసితులు సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేష్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు విద్యార్థి ఎంపిక



శివమణి

ఎటపాక, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి అండర్ - 17 వాలీబాల్ పోటీలకు అల్లూరి జిల్లా ఎటపాక మండలం కేఎస్‌పురం గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల విద్యార్థి ఎంపికయ్యాడు. పదోతరగతి చదువుతున్న అపకా శివమణి కాకినాడలో శుక్రవారం జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చడంతో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. కాగా, తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు ఎన్టీఆర్ స్టేడియంలో శనివారం నుంచి సోమవారం వరకు జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో శివమణి పాల్గొంటాడు. ఈ సందర్భంగా శంకరయ్య, పీడీ కన్నారావు అభినందించారు.

ఉరి పోసుకుని వ్యక్తి ఆత్మహత్య



మృతిచెందిన దొంతంశెట్టి అనిల్‌కుమార్ (ఫైల్)

కొవ్వూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యం తాళలేక ఇంట్లో ఉరిపోసుకుని ఓ వ్యక్తి మృతిచెందినట్లు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. వివరాల్లోకి వెళితే పట్టణంలోని క్రిస్టియన్‌పేటకు చెందిన దొంతంశెట్టి అనిల్‌కుమార్ (28) శనివారం ఇంట్లో చీరతో ఉరి పోసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈయన రాడ్ బైండింగ్ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. కాగా మద్యానికి బానిసై ఇటీవల అనారోగ్యానికి గురయ్యాడు. తరచూ కడుపునొప్పి రావడంతో ఇటీవల ఆసుపత్రిలో చూపించాడు. గత కొంతకాలంగా ఆరికిరేవులలో భార్యతో కలిసి ఉంటున్నాడు. శుక్రవారం కొవ్వూరు వెళ్లి వస్తానని భార్యతో చెప్పి వెళ్లాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో మృతుడి సోదరుడు సతీష్‌కుమార్ శనివారం ఉదయం కొవ్వూరు క్రిస్టియన్‌పేటలోని ఇంటికి వచ్చి చూసేసరికి ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరి పోసుకుని మృతిచెంది ఉన్నాడు. సమాచారం తెలుసుకున్న పట్టణ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య రాజ్యలక్ష్మి అందించిన ఫిర్యాదు మేరకు పట్టణ హెడ్‌కానిస్టేబుల్ ఎంవీవీ సత్యనారాయణ కేసు నమోదు చేశారు.

రైతుల్లో మళ్లీ గోదా‘వర్రీ’

- భద్రాచలం వద్ద 29 అడుగులకు చేరిన గోదావరి నీటిమట్టం
- లంక ప్రాంతాల్లో మిర్చిపంటపై తీవ్ర ప్రభావంతో ఆందోళన



తోటపల్లి వాగులో పెరుగుతున్న నీరు

ఎటపాక, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలోని రైతుల్లో మళ్లీ అలజడి మొదలైంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది వరుసగా తుఫాన్లు రావడంతో సాగు చేస్తున్న పంటలు పాడైపోతున్నాయని వారంతా ఆవేదన చెందుతున్నారు. ముఖ్యంగా విలీన మండలాల రైతులు నిండామునిగారు. అప్పులు చేసి ఇటీవల మిర్చి, పొగాకు పంటలు సాగు చేశారు. ఈక్రమంలో ఇటీవల వచ్చిన మొంథా తుఫాన్ ప్రభావంతో ఆ పంటలన్నీ నీటమునిగాయి. అంతేకాకుండా గోదావరికి మళ్లీ వరద నీరు పోటెత్తింది. దీంతో భద్రాచలం వద్ద గోదావరి శనివారం సాయంత్రం 29 అడుగుల నీటిమట్టం నమోదైంది. అయితే ఈ సమయంలో భద్రాచలం వద్ద 40 అడుగుల మేర నమోదైతే లంక ప్రాంతాల్లో సాగైన మిర్చి తోటలన్నీ పూర్తిగా ముంపు బారిన పడనున్నాయి. గతంలో నవంబరు నెలలో ఎప్పుడూ వరదలు చూడలేదని రైతులు చెబుతున్నారు. వరద 40 అడుగుల మేర పెరిగితే ఒక్కో రైతుకు రూ. 15 లక్షల నుంచి రూ. 20 లక్షల మేర నష్టపోయే పరిస్థితులు ఉన్నాయి.

● దేవీపట్నంలోనూ అదే పరిస్థితి

దేవీపట్నం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల వచ్చిన మొంథా తుఫాన్ ప్రభావంతో గోదావరికి వరద నీరు చేరింది. ముంపు పరీవాహక ప్రాంతాలైన కొండమొదలు, మంటూరు, తాళ్లూరు, నడిపూడి, పూడిపల్లి, అగ్రహారం, తదితర గ్రామాల్లోకి నీరు చేరుకుంది. మాతృశ్రీ గండిపోశమ్మ ఆలయాన్ని గోదావరి చుట్టుముట్టింది. దీంతో పాపికొండలు పర్యాటకాన్ని అధికారులు నిలుపుదల చేశారు.

● తాత్కాలికంగా అమ్మవారి దర్శనం నిలుపుదల

గొందూరులో వేంచేసియున్న మాతృశ్రీ గండి పోశమ్మ అమ్మవారి ఆలయం వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో అమ్మవారి దర్శనాలు తాత్కాలికంగా నిలుపుదల చేసినట్టు జూనియర్ అసిస్టెంట్ కె.వెంకటేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తేదీ ప్రకటించే వరకు ఎవరూ రావొద్దని సూచించారు.

పెద్దసీతనపల్లిలో పాఠశాల గేటుకు తాళం

- స్వీపర్ పోస్టు కోసం ఇరు వర్గాల మధ్య రగడ
- రంగంలోకి దిగిన పోలీసులు



పాఠశాల గేట్‌కు తాళాలు వేసిన భూ దాత

చింతూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పెద్దసీతనపల్లి ఎంపీపీ పాఠశాలలో పారిశుధ్య పనులు చేపట్టే (స్వీపర్) పోస్టు కోసం కొద్ది రోజులుగా ఆ గ్రామంలోని ఇరు పక్షాల నడుమ పోటీ నెలకొంది. చివరకు ఈ పోటీ వివాదానికి దారి తీసింది. ఈ నేపథ్యంలో శనివారం ఆ పాఠశాల భవన నిర్మాణానికి భూమి దానం చేసిన సుబ్బారావు పాఠశాల గేట్‌కు తాళం వేశాడు. దీంతో చేసేదేమి లేక ఉపాధ్యాయులు రచ్చబండ వద్ద బోధన చేపట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. విషయం తెలుసుకున్న చింతూరు ఎస్‌ఐ రమేష్ పాఠశాల వద్దకు తమ సిబ్బందిని పంపించి గేట్ తాళం తీయించి విద్యార్థులను తిరిగి పాఠశాలకు తరలించారు. తదుపరి గ్రామంలో ఎటువంటి వివాదం చోటుచేసుకోకుండా సాయంత్రం వరకు అక్కడే పోలీసులను రక్షణగా ఉంచారు. 2021 నుంచి ఇప్పటి వరకు నడుమ రెండు నెలలు మినహా అదే గ్రామానికి చెందిన శైలజ పాఠశాలలో స్వీపర్‌గా విధులు నిర్వర్తిస్తోంది. తాజాగా తిరిగి శైలజనే స్వీపర్‌గా కొనసాగిస్తూ పాఠశాల నిర్వహణ కమిటీ తీర్మానం కూడా చేసేసింది. ఇదిలా ఉండగా పాఠశాల భవన నిర్మాణం కోసం తమ కుటుంబం భూమి దానం చేసినందున తమ కుటుంబానికి చెందిన మహిళనే స్వీపర్‌గా నియమించాలని భూదాత సుబ్బారావు కుటుంబం పట్టుపట్టింది. కాగా శైలజనే స్వీపర్‌గా కొనసాగిస్తుండడంతో సుబ్బారావు కుటుంబం ఆగ్రహించింది. ఈ క్రమంలో తమ కుటుంబానికి అన్యాయం జరిగిందన్న నిరసనను వ్యక్తం చేస్తూ పాఠశాల గేట్‌కు తాళం వేయడం జరిగింది. విషయం పోలీసులకు చేరడంతో ఇరు పక్షాల నడుమ సర్ది చెప్పారు. అదే క్రమంలో సమస్యను సామరస్యంగా పరిష్కరించే చర్యలు తీసుకోవాల్సిందిగా ఎంఈఓలకు పోలీసులు సమాచారమిచ్చారు. ఈ విషయాన్ని ఎస్‌ఐ రమేష్ ధ్రువీకరించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

- గోకవరం మండలం కొత్తపల్లిలో ఘటన
- బోరున విలపిస్తున్న కుటుంబీకులు

గోకవరం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లిలో శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. స్థానిక పోలీసులు కథనం ప్రకారం.. గంగవరం మండలం జడేరుకు చెందిన షేక్ సాయిబాబా (50) గోకవరంలో నివాసం ఉంటున్న అల్లుడు వద్దకు వచ్చాడు. ఆ తరువాత స్వగ్రామం జడేరు చేరుకునేందుకు స్థానిక ఆర్టీసీ డిపో వద్ద అడ్డతీగల వెళ్లే బస్సు ఎక్కాడు. ఈక్రమంలో బస్సు గోకవరం నుంచి బయలుదేరి కొత్తపల్లి బస్టాండ్‌లో ప్రయాణికులను ఎక్కించుకునేందుకు నిలపగా, సాయిబాబా బస్సు దిగాడు. తిరిగి బస్సు ఎక్కే క్రమంలో కిందకు జారిపోవడంతో అతినిపై నుంచి బస్సు వెనుక చక్రాలు వెళ్తూ కొంతమేర ఊడ్చుకొని వెళ్లిపోయింది. దీంతో తీవ్ర రక్తస్రావమై సాయిబాబా అక్కడికక్కడే మృతిచెందాడు. సాయిబాబాకు నలుగురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. మృతుడు కూలిపని చేసుకుంటూ జీవనం సాగిస్తుంటాడని స్థానికులు చెబుతున్నారు.

అనుమానాస్పదస్థితిలో యువకుడు ...

గోకవరం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): అనుమానస్పదస్థితిలో యువకుడు మృతి చెందిన సంఘటనపై శనివారం గోకవరం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్సై పవన్‌కుమార్ కథనం ప్రకారం.. మండలంలోని తంటికొండ గ్రామానికి చెందిన కామిశెట్టి పుష్పభగవాన్(22) శుక్రవారం రాత్రి గ్రామ సమీపంలో ఉన్న పోలవరం కాలువలోకి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల సమాచారం మేరకు కాలువలో నుంచి మృతదేహన్ని బయటకుతీసి పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించడం జరిగిందన్నారు. జరిగిన సంఘటనపై అందిన ఫిర్యాదు మేరకు అనుమానస్పదమృతిగా కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తొలి తిరుపతికి పోటెత్తిన భక్తులు

పెద్దాపురం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని తొలి తిరుపతి శృంగారవల్లభస్వామి క్షేత్రానికి శనివారం సుమారు 9వేల మందికి పైగా భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారికి అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి నారాయణాచార్యులు విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. శనివారం రూ.4,12,774 ఆదాయం లభించినట్లు ఆలయ ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపారు.

'మహానుభావుడు దేవులపల్లి కృష్ణశాస్త్రి'



రావువారి చంద్రంపాలెంలో దేవులపల్లి విగ్రహానికి నివాళులర్పిస్తున్న తహశీల్దార్

సామర్లకోట, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): దేవులపల్లి కవిత్వంలో భావుకత్వం వెల్లివిరుస్తుంది. ఆయన రాసే గీతాల్లో లాలిత్యం పాఠకులను తన్మయత్వంలో మునిగేలా చేస్తుంది. అటువంటి మహానుభావుడు సామర్లకోట మండలంలో జన్మించడం మనకెంతో గర్వకారణం అని సామర్లకోట తహశీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. దేవులపల్లి కృష్ణశాస్త్రి జయంతిని ఆయన స్వగ్రామం అయిన సామర్లకోట మండలం రావువారి చంద్రంపాలెంలో శనివారం దేవులపల్లి నివాసగృహం అయిన దేవులపల్లి కృష్ణశాస్త్రి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో దేవులపల్లి విగ్రహం ఎదుట ఘనంగా నిర్వహించారు. దేవులపల్లి చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి శీలామంతుల శ్రీనివాసరావు తదితరుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలకు తహశీల్దార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రామ పెద్దలతో కలిసి దేవులపల్లి విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ చీమల భవాని డిప్యూటీ తహశీల్దార్ వై. శ్రీనివాసు, తలాటం గంగబాబు, డేగల బూరిబాబు, గొర్రెల అచ్చారావు, దమ్మాల బాబ్జీ, దమ్మాల చిన్నీ, దమ్మాల మహేష్, తలాటం బాబులు, వీఆర్వో పద్మనాభం, ఉపాధ్యాయులు జీ.నళినీ కుమారి, కె.సత్తిబాబు, హెచ్ఎం భాస్కరరావు పాఠశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో..

సర్పవరం జంక్షన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక బోట్‌క్లబ్ ప్రాంగణంలో వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో ప్రముఖ తెలుగుసాహితీవేత్త దేవులపల్లి వెంకట కృష్ణశాస్త్రి జయంతి పురస్కరించుకుని ఆయన విగ్రహానికి రిటైర్డు డీఎంఈ డాక్టర్ ఎం.రాఘవేంద్రరావు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు అడబాల రత్నప్రసాదరావు, దాసరి శ్రీధర్, ప్రసాద్ నాయుడు, రామారావు తదితరులు ఉన్నారు.

ఎస్పీకి సత్కారం



ఎస్పీ బిందుమాధవ్‌ను సత్కరిస్తున్న బీజేపీ బృందం

కాకినాడ క్రైం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను విలయతాండవ చేసిన సమయంలో విధుల్లో అత్యుత్తమ సేవలు అందించిన జిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్‌ను బీజేపీ రాష్ట్ర భవన నిర్మాణ కమిటీ సభ్యులు, ఇంజనీరు గట్టి సత్యనారాయణ బృందం శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో సన్మానించి సత్కరించారు. సత్యనారాయణ మాట్లాడుతూ ఇటీవల కాకినాడ తీరంలో అలజడి సృష్టించిన మొంథా తుఫాను ప్రభావంతో భారీ నష్టం కలిగే సూచనలున్నాయని కేంద్ర వాతావరణశాఖ హెచ్చరించిన తరుణంలో పోలీస్, రెవెన్యూశాఖలు ప్రజలను అప్రమత్తం చేయడంలో ఎనలేని కృషి చేశారన్నారు. తుఫాను సహాయ పునరావాస కేంద్రాలకు తరలివెళ్లేందుకు ప్రజలు విముఖత వ్యక్తం చేయడంతో వారిని ఒప్పించి సురక్షితంగా ఉండేందుకు అధికారులు తీసుకున్న చర్యలు అభినందనీయమన్నారు. ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు ఎప్పుడు ఏ ఇబ్బంది వచ్చినా ప్రాణాలకు తెగించి ముందు వరసలో నిలబడటమే పోలీసుల కర్తవ్యమన్నారు. బీజేపీ నేతలు పైడా వెంకటనారాయణ, కొండేటి గంగాధర్, కర్రి రాజు, మధుసుధన్‌రావు, నూకరాజు, శ్రవణకుమార్, సత్యనారామణరెడ్డి తదితరులు ఉన్నారు.

26న రాజ్యాంగ హక్కుల సాధన సభ

కాకినాడ సిటీ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : జాతీయ మాల మహానాడు ఆధ్వర్యంలో ఈ నెల 26న తలపెట్టిన రాజ్యాంగ హక్కుల సాధన సభ, ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆంధ్ర మాల మహానాడు రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు సిద్ధాంతుల కొండబాబు, దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కో ఆర్డినేటర్ తోటి చెంగల్‌రావు, జై భీమ్ రావ్ భారత్ పార్టీ పీఏసీ చైర్మన్ ఏనుగుపల్లి కృష్ణ పిలుపునిచ్చారు. శనివారం కలెక్టరేట్ వద్ద రాజ్యాంగ హక్కుల సాధన సభ, ఛలో ఢిల్లీ కార్యక్రమం కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాతీయ మాల మహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ అద్దంకి దయాకర్ ఆధ్వర్యంలో ఈ నెల 26న ఢిల్లీలో పార్లమెంట్ స్ట్రీట్ జంతర్ మంతర్ వద్ద రాజ్యాంగ హక్కుల సాధన సభ జరుగుతుందన్నారు. జాతీయ స్థాయిలో మాల, మహర్ అనుబంధ కులాల అభివృద్ధి కోసం ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలన్నారు. శాస్త్రీయమైన లెక్కలు లేకుండా చేసిన ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ, రోస్టర్ జీవో 99, జీవో 29లను తక్షణం పునః సమీక్షించాలన్నారు. ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు చట్టం తీసుకురావాలని, ఎస్సీ రిజర్వేషన్ల శాతాన్ని 15 నుంచి 20 శాతానికి పెంచాలని తదితర డిమాండ్లతో తలపెట్టిన సభను విజయవంతం చేసేందుకు వేలాదిగా ఢిల్లీకి తరలివెళ్లాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో దళిత సత్తా రాష్ట్ర నాయకుడు బచ్చల కామేశ్వరరావు, జై భీమ్ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు తంతేటి కిరణ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంచె రఘు, నాయకులు సోమేశ్వరరావు, సాదే రాంబాబు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి రథోత్సవం



రథోత్సవాన్ని ప్రారంభిస్తున్న భక్తులు

కరప, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): కరపలో శనివారం రాత్రి అయ్యప్పస్వామి రథోత్సవం ఘనంగా జరిగింది. రథంలో అయ్యప్పస్వామిని ప్రతిష్ఠించగా గురుస్వామి ఉప్పాడ కరణం ఆధ్వర్యంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. స్థానిక శివాలయం నుంచి రథోత్సవం ప్రారంభమయ్యింది. ఏటా కార్తీక ఏకాదశిరోజున రథోత్సవం నిర్వహిస్తున్నట్టు గురుస్వాములు నక్కా వీరభద్రం, పాట్నీడి సత్యభీమేశ్వరరావు, ముద్రగడ నానాజీ, తోట శ్రీను తెలిపారు.

నేడు పిఠాపురంలో యాదవ కార్తీక వన సమారాధన

పిఠాపురం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారు నరసింగపురం రోడ్డులోని దంగేటి వారి తోటలో ఆదివారం యాదవ సంఘం ఆధ్వర్యంలో కార్తీక వనసమారాధన నిర్వహిస్తున్నట్లు సంఘం ప్రతినిధులు తెలిపారు. ఉదయం 10గంటలు నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు ప్రారంభమవుతాయని యాదవులంతా హాజరుకావాలని కోరారు.

వేణుగోపాలుడి కల్యాణం



రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామికి కల్యాణ అలంకారం

పిఠాపురం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): సంతాన గోపాలుడిగా ప్రసిద్ధిగాంచిన పిఠాపురంలోని రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి కల్యాణం శనివారం రాత్రి వైభవంగా జరిగింది. విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, మండపారాధన, మండపారాధనలో కల్యాణక్రతువును నిర్వహించారు. ఆలయ ఈవో నున్న శ్రీరాములు, వేణుగోపాలస్వామి ఆలయ అభివృద్ధి సేవాసమితి సభ్యులు పట్టువస్త్రాలు సమర్పించారు. ఉదయం మహిళా భక్తులు పసుపుపోటు, అనంతరం స్వామి, అమ్మవార్లకు కల్యాణ అలంకారం చేశారు. యాగ్నికబ్రహ్మ సుదర్శనం మాధవ మణికంఠాచార్యులు, ఆలయ అర్చకులు పి.విజయజనార్ధనాచార్యులు, వేణుగోపాల అవినాష్‌లు కల్యాణక్రతువును జరిపించారు. సేవాసమితి సభ్యులు చెరుకుపల్లి శ్రీనివాస్, ప్రియాంక, పైండా రమ, శ్రీరామమోహన్, అప్పలరాజు, విద్యాగణపతి భక్త బృందం సభ్యులున్నారు.

దుర్గాడలో సప్తాహ మహోత్సవాలు ప్రారంభం

గొల్లప్రోలు రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం దుర్గాడ శివాలయంలో సప్తాహమహోత్సవాల మహాయజ్ఞం ప్రారంభమైంది. 168గంటల పాటు నిరంతరాయంగా జరిగే ఈ భజన కార్యక్రమాల మహోత్సవానికి కలశస్థాపన, మండపారాధన, గణపతిపూజ, జ్యోతి ప్రజ్వలన, పార్వతి పరమేశ్వరుల పూజా కార్యక్రమాలు నిర్వహించి ప్రారంభించారు. పలు భక్తభజన సమాజాలు పాలుపంచుకుంటున్నాయి. అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తులు పూజలు నిర్వహించగా, సేవాసమితి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

మహాన్నదానం

గొల్లప్రోలు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాతబస్టాండు వద్ద విజయదుర్గమ్మ ఆలయం వద్ద శనివారం మహాన్నదానం జరిగింది. దసరా ఉత్సవాల ముగింపులో భాగంగా నిర్వహించిన ఈ అన్నదాన కార్యక్రమానికి గొల్లప్రోలు పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు భారీగా పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు చిరస్మరణీయుడు

పెద్దాపురం ఎమ్మెల్యే చినరాజప్ప



సామర్లకోటలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన ఎమ్మెల్యే రాజప్ప

సామర్లకోట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలర్పించి అమరజీవి పొట్టి శ్రీరాములు చిరస్మరణీయుడని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పేర్కొన్నారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం పురస్కరించుకుని సామర్లకోట మఠం సెంటర్ పొట్టి శ్రీరాములు పార్కు వద్ద టీడీపీ నాయకులు అడబాల కుమారస్వామి, బగుడు శ్రీకాంత్, కంటే జగదీష్ మోహన్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే చినరాజప్ప హాజరై పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం టీడీపీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రం గత వైసీపీ పాలనలో అన్నిరంగాల్లో పూర్తిగా నిర్వీర్యం అయ్యిందని తిరిగి పూర్వ వైభవం తెచ్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు చేస్తున్న పరిపాలనా సంస్కరణలు అద్భుత ఫలితాలను ఇస్తున్నందునే వివిధ దేశాల నుంచి పెట్టుబడిదారులు, వ్యాపారవేత్తలు ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో భాగస్వాముల య్యేందుకు ముందుకు వస్తున్నారని ఎమ్మెల్యే చినరాజప్ప పేర్కొన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు బలుసు శ్రీనివాసు, జయలక్ష్మి, పిల్లాడి సత్యవతి, ఏఎంసీ చైర్‌పర్సన్ అందుగుల మణికుమారి, నాయకులు పైణ్ణి శ్రీనివాసు, వల్లూరి దొరబాబు, ఎండీ సైపుల్లా, గొలితి సత్యనారాయణ, బలరామ్ పాల్గొన్నారు.

సామర్లకోట ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవీ కన్యాకాపరమేశ్వరీ ఆలయ ఆవరణలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి అధ్యక్షుడు కుసుమంచి శేషగిరిరావు, సంఘ ప్రతినిధులు సంకా గుప్తా, కటకం చినవీర్రాజు, కటకం సతీష్, కంచర్ల నాగేశ్వరరావు, కారుమూరి పవన్, కటకం సృజన్, కంచర్ల మల్లిబాబు, దొంతుల రమేష్, కె.సుష్మామోహిని పూలమాలలు వేశారు.

గొల్లప్రోలులో..

గొల్లప్రోలు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలులో ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పొట్టి శ్రీరాములు చిత్రపటానికి ఆర్యవైశ్య సంఘం, వాసవిక్లబ్ ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సఖి సురక్ష కార్యక్రమం



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్సీ

కార్పొరేషన్ (కాకినాడ), నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కాకినాడ నగర పాలక సంస్థ పరిధిలో మెప్మా ఆధ్వర్యంలో భానుగుడి పాత మీ సేవా కేంద్రం, జగన్నాధపురం అన్నమ్మగాటి కమ్యూనిటీ హాల్‌లో శనివారం సఖి సురక్ష కార్యక్రమం నిర్వహించారు. స్వయం సహాయక సంఘాలకు చెందిన 35 ఏళ్ల పైబడిన మహిళలకు ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, వనమాడి మోహనవర్మ హాజరయ్యారు. మహిళలు ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకుండా ఇలాంటి కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ బి.ప్రియంవద మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలో ఈ కార్యక్రమాలు ఈనెల 3 వరకు కొనసాగనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్లు, టీడీపీ టౌన్ ప్రెసిడెంట్ మల్లిపూడి వీరు, టౌన్ ప్రాజెక్టు అధికారి కె.శైలజ, జిల్లా జీవనోపాధి అధికారి రవిశంకర్, మెప్మా సిటీ మిషన్ మేనేజర్ డి.వెంకటరాజు పాల్గొన్నారు.

తిరుమలలో వెంకన్నను దర్శించుకున్న కొండబాబు



దర్శనం అనంతరం ఎమ్మెల్యే కొండబాబు

కాకినాడ సిటీ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : తిరుమల తిరుపతి దేవస్థానంలో శ్రీ వేంకటేశ్వరస్వామిని శనివారం కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు దర్శించుకున్నారు. అనంతరం అన్న ప్రసాద నిలయంలో భక్తులతో కలిసి ఎమ్మెల్యే కొండబాబు భోజనం చేశారు. టీడీపీ నాయకులు నృసింహదేవర విశ్వనాథం, అమన్ జైన్, జామి కృష్ణమోహన్, కె.అరవిందస్వామి ఉన్నారు.

రిలయన్స్ ఫౌండేషన్ రాష్ట్ర నిర్వాహకుడికి ప్రశంస



సీఎం చంద్రబాబు నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న చిట్టిబాబు

పెద్దాపురం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ, మత్స్యకార సమాజాల రక్షణలో విశిష్ట సేవలందించిన రిలయన్స్ ఫౌండేషన్ రాష్ట్ర నిర్వాహకుడు పెద్దాపురం మండలం గోరింటకి చెందిన ఎన్.చిట్టిబాబును రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రశంసించారు. మొంథా తుఫాను సమయంలో తీర ప్రాంతాల్లోని మత్స్యకారులు, రైతుల ప్రాణాలను, జీవనోపాధిని కాపాడడంలో రిలయన్స్ ఫౌండేషన్ తరపున ఆయన చేసిన కృషికి గుర్తింపుగా విజయవాడలో చంద్రబాబు అభినందించారు.

వర్మకు సైక్లోన్ ఫైటర్ అవార్డు

పిఠాపురం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ సమయంలో ప్రజలకు అందించిన సేవలకు గానూ పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మకు సైక్లోన్ మొంథా ఫైటర్ అవార్డు లభించింది. సీఎం క్యాంపు కార్యాలయంలో శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబు అవార్డు, ప్రశంసాపత్రాన్ని అందజేశారు. అవార్డు తన బాధ్యత మరింత పెంచిందని వర్మ తెలిపారు.



అవార్డు అందుకుంటున్న వర్మ

ఘనంగా భగవాన్ బిర్సా ముండా జయంతి



భగవాన్ బిర్సా ముండా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న అధికారులు

కలెక్టరేట్ (కాకినాడ), నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): భారత స్వాతంత్ర్య పోరాటంలో ముఖ్యమైన పాత్ర పోషించడమే కాకుండా గిరిజనుల హక్కుల కోసం పోరాడిన గొప్ప యోధుడు భగవాన్ బిర్సా ముండా అని ట్రైనీ కలెక్టర్ మనీషా పేర్కొన్నారు. కాకినాడ కలెక్టరేట్‌లో భగవాన్ బిర్సా ముండా 150వ జయంతిని పురస్కరించుకుని భగవాన్ బిర్సా ముండా చిత్రపటానికి ట్రైనీ కలెక్టర్ మనిషా, జిల్లా ఎస్టీ సంక్షేమ సాధికారితాధికారి నాగమల్లేశ్వరరావు, కేఆర్ఆర్సీ ఎస్డీసీ రత్నమణి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మనీషా మాట్లాడుతూ 19వ శతాబ్దపు చివరిరోజుల్లో నేటి బీహార్, ఝార్ఖండ్ ఆటవిక ప్రాంతాల్లో బ్రిటీష్ కాలంలో జరిగిన మిలీనేరియన్ ఉద్యమానికి భగవాన్ బిర్సా ముండా సారథ్యం వహించారన్నారు. ఆయన 22 వయస్సులోనే బ్రిటీషర్లపై తిరుగుబాటు చేయడం ద్వారా భారత స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో ప్రముఖ వ్యక్తిగ నిలిచారన్నారు. గిరిజన సంక్షేమాధికారి నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ ఈ జయంతిని పురస్కరించుకుని గిరిజన సమాజ చరిత్ర, వారసత్వం, సాంస్కృతిక విలువలను ప్రతిబింబించేలా ఈనెల 1 నుంచి ఈనెల 15వరకు ఉత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. కలెక్టరేట్ ఏవో రామ్మోహన్‌రావు, గిరిజన సంక్షేమశాఖ సిబ్బంది తదితరులు ఉన్నారు.

పింఛన్ల అందజేత

పెద్దాపురం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): పేదలకు భరోసా కల్పించేందుకు ప్రభుత్వం ఎన్టీఆర్ భరోసా పేరుతో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుందని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. పట్టణ పరిధిలో పలువురికి ఆయన పింఛన్లు శనివారం పంపిణీ చేశారు. మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి, కూటమి నేతలు పాల్గొన్నారు.

సామర్లకోట (ఆంధ్రజ్యోతి): పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని సామర్లకోట పొట్టి శ్రీరాములు పార్కు ఆవరణలో శనివారం మున్సిపల్ కమిషనర్ ఏ.శ్రీవిద్య ఆధ్వర్యంలో నిర్వహిం చారు. ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప హాజరై పలు వార్డులకు చెందిన వృద్ధాప్య, వితంతు, పీహెచ్, దీర్ఘకాలిక వ్యాధుల వారికి పింఛన్ సొమ్ములను అందజేసి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అడబాల కుమారస్వామి, బడుగు శ్రీకాంత్, కంటే జగదీష్‌మోహన్(బాబు), బలుసు శ్రీనివాసు, జయలక్ష్మి, పిల్లాడి సత్యవతి, అందుగుల మణికుమారి, కంచర్ల సుష్మామోహిని, కాటంరెడ్డి వాసవీ అరుణకుమారి, ఎండీ సైపుల్లా, గొలితి సత్యనారాయణ, కుసుమంచి శేషగిరిరావు(బాబీ), కంచర్ల నాగేశ్వరరావు, కటకం చినవీర్రాజు తదితరులు ఉన్నారు.

కరప (ఆంధ్రజ్యోతి): కాజులూరు మండలం కోలంక, కుయ్యేరు గ్రామాల్లో టీడీపీ సీనియర్ నేత వాసంశెట్టి సత్యం పర్యటించి పలువురు లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా ఫింఛన్లను అందజేశారు. జనసేన ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్‌రాయ్, టీడీపీ మండలాధ్యక్షుడు చవ్వాకుల నారాయణమూర్తి, ఎంపీడీవో జె.రాంబాబు పాల్గొన్నారు.

ముంపు తగ్గగానే రక్షణ చర్యలు : మర్రెడ్డి



పిఠాపురం-గొల్లప్రోలు మధ్య ఏలేరు వరదను పరిశీలిస్తున్న జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి

గొల్లప్రోలు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఏలేరు వరద ముంపు తగ్గగానే గట్లు పటిష్టత, గండ్లు పూడ్చివేతతో పాటు రక్షణ చర్యలు చేపడతామని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు తెలిపారు. పిఠాపురం-గొల్లప్రోలు పట్టణాల మధ్య గల ఏలేరు కాలువలను శనివారం పరిశీలించారు. గండ్లు, కోతకు గురైన గట్లును పరిశీలించి జరిగిన నష్టంపై ఆరా తీశారు. నష్టపోయిన రైతులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు.

'గండ్లు పూడ్చకపోవడమే నష్టానికి కారణం'

పిఠాపురం రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఏలేరుకు గతేడాది సంభవించిన భారీ వరదల కారణంగా పడిన గండ్లను పూర్తి స్థాయిలో పూడ్చకపోవడం, గట్లు పటిష్టం చేయకపోవడమే వల్లే అధిక నష్టం జరుగుతోందని కాకినాడ మాజీ ఎంపీ వంగా గీతావిశ్వనాథ్ విమర్శించారు. పిఠాపురం మండలం మాధవపురం, ఇల్లింద్రాడ తదితర ప్రాంతాల్లో ముంపునకు గురైన పొలాలను ఆమె శనివారం పరిశీలించారు. రైతులు కష్టాలను గీతకు వివరించారు. కలెక్టర్, ఇరిగేషన్ ఉన్నతాధికారులతో మాట్లాడి అసంపూర్తిగా ఉన్న గండ్లు పూడ్చించే విధంగా చర్యలు తీసుకుంటామని హామీఇచ్చారు. నష్టపోయిన రైతులకు పరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు.

రైతు సంక్షేమమే ధ్యేయం

కరప, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ కాకినాడరూరల్ నియోజకవర్గ కోకో-ఆర్డినేటర్ కటకంశెట్టి వెంకటప్రభాకర్(బాబి) స్పష్టంచేశారు. కరపమండలం అరట్లకట్ట, గొడ్డటిపాలెం, జడ్.బావారం, కొరుపల్లి గ్రామాల్లో శనివారం ఆయన పర్యటించి తుఫాను కారణంగా దెబ్బతిన్న పంటపొలాలను పరిశీలించారు. ఇక్కడి రైతాంగానికి జరిగిన నష్టాన్ని సీఎం చంద్రబాబు, మంత్రి అచ్చెన్నాయుడుల దృష్టికి తీసుకెళ్లి తనవంతు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్ర గౌడకార్పొరేషన్ డైరెక్టర్ మట్టా ప్రకాష్‌గౌడ్, నాయకులు బత్తుల సతీష్, గుబ్బల భాస్కరరావు, మార్కొండేయులు, యర్రమాటి శ్రీనివాస్, ముత్యాలరావు, కురుకూరి గోపాలకృష్ణ పాల్గొన్నారు.

డివిజన్ స్థాయి క్రీడా పోటీలు

కార్పొరేషన్(కాకినాడ), నవంబరు 1(ఆంధ్రజ్యోతి): కాకినాడ డీఎస్ఏ నందు జిల్లా ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో కాకినాడ డివిజన్ స్థాయి క్రీడా పోటీలు శనివారం నిర్వహించారు. అండర్-14, 17 బాలబాలికలకు చదరంగం, షటిల్, యోగా తదితర పోటీలు జరిగాయి. సుమారు 300 మంది క్రీడాకారులు హాజరవ్వగా సుమారు 50మంది క్రీడాకారులను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేశామని కాకినాడ డివిజన్ స్పోర్ట్స్ కోఆర్డినేటర్ లంకా జార్జి తెలిపారు. ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శులు కె.శ్రీనివాసరావు, సుధారాణి, కాకినాడ రూరల్ మండలం స్పోర్ట్స్ ఆర్గనైజర్ ఎం.హరిబాబు, సీనియర్ పీడీలు రవిరాజు, సునీల్‌కుమార్ పాల్గొన్నారు. న్యాయనిర్ణేతలుగా త్రిపుల, మూర్తి, నారాయణరావు, త్రిమూర్తులు, గోవిందు, మంగయమ్మ, డీఎస్ఏ షటిల్ కోచ్ చిన్నారి ఉన్నారు.

పూడికల తొలగింపు

పిఠాపురం, నవంబరు 1 (ఆంధ్రజోతి): పట్టణం జగ్గయ్యచెరువు శివారు అవుట్‌లెట్‌ల్లో పేరుకుపోయిన పూడికల తొలగింపును శనివారం ప్రారంభించారు. కాలనీల్లో నీరు బయటకు వెళ్లే అవుట్‌లెట్లు మూసుకుపోవడంతో ఇటీవల కురిసిన భారీ వర్షాలు, తుఫాన్ ప్రభావంతో ఎక్కడిక్కడ నీరు నిలిచిపోయింది. ఈ విషయం డిప్యూటీ సీఎం పవన్ దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన స్పందించారు. తక్షణం అన్ని ప్రాంతాల్లో పూడికలు తొలగించాలని ఆదేశించారు. పొక్లెయిన్లతో అవుట్‌లెట్లుల్లో పూడిక తొలగింపును ప్రారంభించారు. జనసేన నాయకుడు బాలిపల్లి రాంబాబు, కౌన్సిలర్లు కావాడి పోశయ్య, బండి రవి, పోలిశెట్టి శేఖర్, కిషోర్, మున్సిపల్ ఏఈ, సిబ్బంది పాల్గొన్నారు.

ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దేందుకు చర్యలు

కాకినాడ కమిషనర్ సుధాకర్



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్

కార్పొరేషన్ (కాకినాడ), నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వివిధ మార్గాల ద్వారా ఆదాయ వనరులు సమకూర్చుకుని నగరపాలక సంస్థను రాష్ట్రంలో ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామని కమిషనర్ కెటి సుధాకర్ తెలిపారు. శనివారం ఉదయం ఆయన శానిటేషన్ సర్కిల్ 1 పరిధిలోని ఫ్రెండ్స్ కాలనీ, వైద్య నగర్ ప్రాంతాల్లో పర్యటించి ఖాళీ స్థలాల్లో పేరుకుపోయిన చెత్తను పరిశీలించారు. ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులు జారీ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎస్ఎఫ్‌సిఎల్ రోడ్డులోని కల్వర్టును పరిశీలించిన కమిషనర్ మాట్లాడుతూ కాకినాడలో పన్నులు చెల్లించని ఖాళీ స్థలాలను ఇప్పటికే గుర్తించామన్నారు. ఆయా యజమానులు నవంబరు 25లోపు పన్నులు చెల్లించాలని, ఆ గడువు నాటికి చెల్లించనట్టయితే ఆ స్థలాలను ప్రభుత్వానికి 22 (ఎ) జాబితాలో చేర్చి స్వాధీనం చేసుకుంటామని హెచ్చరించారు. నగరంలోని ఖాళీ స్థలాల్లో చెత్త పేరుకుపోవడం వల్ల స్థానికులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆ చెత్తను తొలగించి కాలనీల అభివృద్ధి దిశగా చర్యలు చేపడతామని కమిషనర్ పేర్కొన్నారు. పర్యటనలో హెల్త్ ఆఫీసర్ పృథ్వీచరణ్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు, ఇతర అధికారులు ఉన్నారు.

యువసేనకు రూ.లక్ష అందజేత



నగదును అందజేస్తున్న ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ కార్యాలయ ప్రతినిధులు

కాకినాడ సిటీ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : శ్రీ యువసేన ఆధ్వర్యంలో అంబికా అక్వేరియం రెస్టారెంట్ నిర్వాహకులు చేస్తున్న సేవా కార్యక్రమాలకు కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ పేద విద్యార్థుల చదువు నిమిత్తం తన వంతుగా రూ.లక్ష ఆర్థిక సహాయం ప్రకటించారు. శనివారం ఎంపీ కార్యాలయ నాయకులు నున్న దొరబాబు, చక్రి చేతులమీదుగా రూ.లక్ష శ్రీ యువసేన సేవా సంస్థ అధినేత బొల్లం సతీష్, రెస్టారెంట్ నిర్వాహకులు కోన సతీష్ ప్రశాంతికి అందజేశారు.

కరప ఎంపీడీవోగా శ్రీనివాస్ బాధ్యతల స్వీకరణ

కరప, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): కరప నూతన ఎంపీడీవోగా జటావల్లభుల శ్రీనివాస్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం ఇన్‌చార్జ్ ఎంపీడీవో సలాది వెంకటశ్రీనివాసరావు నుంచి ఆయన చార్జ్ తీసుకున్నారు. శ్రీనివాస్‌ను డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసరావు, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో రాయి ప్రభాకరరావు, కార్యాలయ ఏవో బీఎల్ నరసింహం, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

సప్తాహ వేడుకలు

పెద్దాపురం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): కట్టమూరులో దబ్బలదిబ్బ వీధి కోదండ రామాలయం వద్ద శనివారం సప్తాహ వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయంలోని దేవతామూర్తులకు నూతన వస్త్రాలను సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు. ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప హాజరయ్యారు. కార్యక్రమంలో ఎలిశెట్టి నాని, అడపా గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామికి పూజలు

కొత్తపల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): వాకతిప్ప గొల్లపేటలో శనివారం శ్రీకృష్ణ వేణుగోపాలస్వామి 3వ వార్షికోత్సవం సందర్భంగా యాదవ వంశీకులు ఈగల వీర్రాజు దంపతుల ఆధ్వర్యంలో ప్రత్యేక హోమం నిర్వహించారు. శ్రీకృష్ణ వేణుగోపాలస్వామికి ప్రత్యేక పూజలు, లోక కల్యాణార్థం విశేష ద్రవ్యాలతో హోమం చేశారు. భారీ అన్నసమారాధనలో పరిసర గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

'ప్రతి పౌరుడు అవినీతిని అరికట్టడంలో ముందుండాలి'

గండేపల్లి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని సూరంపాలెం పవర్‌గ్రిడ్ కార్పొరేషన్‌లో విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు ముగింపు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పౌరుడు అవినీతిని అరికట్టడంలో భాగస్వామ్య కావాలన్నారు. సైబర్ నేరాల గురించి విద్యార్థులకు వివరించారు. పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. అనంతరం డీఎస్పీ మొక్కలు నాటారు. కార్యక్రమంలో డీజీఎం పవన్‌కుమార్, పవర్‌గ్రిడ్ మేనేజర్లు కోటేశ్వర రావు, నవీన్ పాల్గొన్నారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

చింతూరు ఏఎస్పీగా హేమంత్

● రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ

చింతూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): చింతూరు ఏఎస్పీగా బొడ్డు హేమంత్‌ను నియమిస్తూ శనివారం రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈయన 2023 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందినవాడు. (అసాల్ట్ కమాండర్ (గ్రేహౌండ్స్) ఏఎస్పీగా బాధ్యతలు స్వీకరించనున్నారు. ఇప్పటివరకు ఇక్కడ ఏఎస్పీగా పని చేసిన పంకజ్‌కుమార్ మీనా అల్లూరి సీతారామరాజు జిల్లా అడిషనల్ ఎస్పీగా పదోన్నతిపై బదిలీ అయిన విషయం విధితమే. ఈయన బాధ్యతలు స్వీకరించనున్నారు.

ఐటీడీఏలో ఘనంగా బిర్సాముండా జయంతి



బిర్సాముండా చిత్రపటానికి నివాళులర్పించిన ఐటీడీఏ పీవో

రంపచోడరం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఐటీడీఏ కార్యాలయంలో శనివారం బిర్సాముండా 150వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఐటీడీఏ పీవో బీ.స్మరణ్ రాజ్, రాష్ట్ర ఎస్టీ కమిటీ చైర్మన్ చోళ్ల బొజ్జిరెడ్డి, సబ్ డివిజనల్ పోలీస్ అధికారి సాయిప్రశాంత్, ఎస్టీ కమిటీ డైరక్టర్ గొర్లె డెబోరా సునీత బిర్సాముండా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుల ర్పించారు. పీవో మాట్లాడుతూ బిర్సాముండా గిరిజన హక్కుల కోసం అలుపెరుగని పోరాటం చేశారన్నారు. తొలుత వివిధశాఖల ఉద్యోగులు, విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ డైరక్టర్ షేక్ సుబానీ, మాజీ ఎమ్మెల్యేలు శీతంశెట్టి వెంకటేశ్వరరావు, చిన్నం బాబు రమేష్, కోసూరి కాశీ విశ్వనాథ సత్యనారాయణరెడ్డి, సర్పంచ్ మంగా బొజ్జయ్య, వైస్ ఎంపీపీ కె.బాలకృష్ణ, ఆదివాసీ చైతన్యవేదిక అధ్యక్షుడు వెదుళ్ల లచ్చిరెడ్డి, ఏపీవో(జీ) డీఎస్వీ రమణ, డిప్యూటీ డైరక్టర్లు రుక్మాండయ్య, షరీఫ్, తహశీల్దార్ బాలాజీ, పీహెచ్‌వో దేవదానం, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రైతులకు ఉపకరణాల పంపిణీ



రైతులకు పంపిణీ చేస్తున్న ఐటీడీఏ పీవో

రంపచోడవరం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): వెలుగు, ఉద్యాన వన శాఖల ద్వారా గిరిజన రైతులకు శనివారం సబ్సిడీతో కూడిన ఉపకరణాలను ఐటీడీఏ పీవో బీ.స్మరణ్‌రాజ్, రాష్ట్ర ఎస్టీ కమిటీ చైర్మన్ చోళ్ల బొజ్జిరెడ్డి పంపిణీ చేశారు. రూ.46.62 లక్షల వ్యయంతో 36 మంది రైతులకు పవర్ టిల్లర్లు, రూ.12 లక్షల వ్యయంతో 100 ఆయిల్ ఇంజన్లు అందజేశారు. ఎస్డీపీవో సాయిప్రశాంత్, ఎస్టీ కమిటీ డైరక్టర్ గొర్లె డెబోరా సునీత, రాష్ట్ర మైనార్టీ డైరక్టర్ షేక్‌సుబానీ, మాజీ ఎమ్మెల్యేలు శీతంశెట్టి వెంకటేశ్వరరావు, చిన్నం బాబూరమేష్, కోసూరి కాశీ విశ్వనాథ సత్యనారాయణరెడ్డి, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ



పింఛన్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

మోతుగూడెం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి):రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ సీనియర్ నాయకుడు మడివి ఓలయ్య అన్నారు. శనివారం మోతుగూడెం పరిధిలోని మోతుగూడెం, పొల్లూరు, ఫోర్ బై గ్రామాల్లో ఇంటింటికీ తిరుగుతూ పింఛన్లు పంపిణీ చేశారు. అనంతర ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో మరిన్ని అభివృద్ధి పథకాలను అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ ఎంపీటీసీ వేగినాగేశ్వర రావు, పార్టీ సీనియర్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

దేవీపట్నం: ఇందుకూరు-1, ఏనుగులగూడెం, ఆర్అండ్ఆర్ కాలనీలోని లబ్ధిదారులకు సర్పంచ్ కుంజం రాజమణి చేతులమీదుగా ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశారు. అలాగే కృష్ణునిపాలెం ఆర్అండ్ఆర్ కాలనీలో తెలుగు యువత అధ్యక్షుడు పల్లీల బాబీ, సిద్ధా సత్యనారాయణ, లంక హరిబాబు సచివాలయ సిబ్బందితో కలిసి పింఛన్లు పంపిణీ చేశారు.

సమాచారం ఇవ్వని అధికారులపై చర్యలు తీసుకోవాలి

కూనవరం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో ఎన్ని అక్రమ కట్టడాలు కట్టారు, ఎన్ని తొలగించారనే దానిపై సమాచార హక్కు చట్టం ద్వారా ఫిర్యాదు చేసినప్పటికీ ఇంతవరకు సమాచారం ఇవ్వని అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ సెప్టెంబరు 24వ తేదీన కూనవరం తహశీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవడం జరిగిందని, ఇప్పటికి దరఖాస్తు గడువు ముగిసి వారం రోజులు గడుస్తున్నా... సమాచారం ఇవ్వలేదన్నారు. దీనిపై కలెక్టర్ జోక్యం చేసుకోవాలని కోరారు.

పోలవరం నిర్వాసితుల సమస్యలు పరిష్కరించండి

దేవీపట్నం, నవం బరు 1 (ఆంధ్రజ్యోతి): పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టుతో నిర్వాసితులైన 44 గ్రామా ల ప్రజల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శనివారం బీజేపీ మండలాధ్యక్షుడు కారం రామన్నదొర ఎస్టీ కమిషన్ చైర్మన్ సోళ్ల బొజ్జిరెడ్డిని కలిసి వివరించారు. ఆర్అండ్ఆర్ ప్యాకేజీ, భూమి, మౌలిక సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఆయన వెంట యలగాడ నాగేశ్వరరావు, కురసం వెంకన్నదొర, అబ్బులు, తదితరులు ఉన్నారు.

అమరవీరుల ఆశయ సాధనకు కృషి చేయాలి

● సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ



కార్యక్రమంలో పాల్గొన్న సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు

రంపచోడవరం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): విప్లవ కమ్యూనిస్టు ఉద్యమాల్లో అసువులు బాసిన అమర వీరుల ఆశయ సాధనకు కృషి చేయాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు పీ. లచ్చిరెడ్డి అన్నారు. కాకవాడ, అనెంపల్లి గ్రామాల్లో శనివారం అమరవీరుల స్థూపాల వద్ద విప్లవ జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సమాజంలో దోపిడీ, అణిచివేత ఉన్నంతకాలం కమ్యూనిస్టులు ఉంటారన్నారు. కార్యక్రమంలో అఖిలభారత రైతుకూలీ సంఘం నాయకులు పల్లాల అశోక్, మడకం జోగమ్మ, వలల మంగయ్య, శంబుడు సూరిబాబు, పి.ధర్మారెడ్డి, కె.మూర్తిరెడ్డి, మడకం గోవింద్, కె.కృష్ణ, బి.బుల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

పోలీసింగ్‌పై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్ఐ సాధిక్

మోతుగూడెం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం మోతుగూడెం పోలీస్ స్టేషన్‌లో శనివారం డీఏవీ పాఠశాల విద్యార్థులు, జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు పోలీసింగ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ ఎస్కే సాధిక్ మాట్లాడుతూ ప్రజారక్షణలో భాగంగా పోలీసులు వినియోగిస్తున్న ఆయుధాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ రాజేశ్వరరావు, హెడ్ కానిస్టేబుల్ నిబంధన సన్నీ, సుబ్బారావు, పురుషోత్తం సీఆర్పీఎఫ్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు



కోటనందూరు: టీజేనగరంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే దివ్య



సూరంపాలెంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నెహ్రూ



రాచపల్లిలో వృద్ధుడికి పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ

పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

● పింఛన్ల పంపిణీలో పాల్గొన్న ఎమ్మెల్యేలు దివ్య, నెహ్రూ, సత్యప్రభ

కోటనందూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమమే కూటమిప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్, తుని ఎమ్మెల్యే యనమల దివ్య అన్నారు. మండలంలోని టీజే నగరంలో పింఛన్ పంపిణీలో శనివారం ఆమె పాల్గొన్నారు. గ్రామానికి చెందిన సుర్ల రాజుబాబు కుటుంబానికి రూ.5లక్షల బీమా చెక్కును అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నేతలు యనమల రాజేష్, చింతంనీడి అబ్బాయి, గాడి రాజుబాబు, అంకంరెడ్డి రమేష్, పెంటకోట భాస్కరసత్యనారాయణ, పార్టీ మండల అధ్యక్షుడు పోతల సూరిబాబు, గొర్లి అచ్చియ్యనాయుడు, పెనుముచ్చు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

గండేపల్లి(ఆంధ్రజ్యోతి): మండలంలోని సూరంపాలెంలో సామాజిక పింఛన్లను పలువురు లబ్ధిదారులకు ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ శనివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, కుంచే రాజా, కందుల చిట్టిబాబు, కుంచే రామకృష్ణ, సూరంపాలెం బాలు, ఎంపీడీవో హరికృష్ణ సత్యరెడ్డి, కర్రి చంద్రరావు పాల్గొన్నారు.

రౌతులపూడి(ఆంధ్రజ్యోతి):మండలంలోని ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశారు. మూలగపూడిలో టీడీపీ మండల అధ్యక్షుడు తమరాల సత్యనారాయణ, రౌతులపూడిలో ఎంపీపీ గంటిమళ్ల రాజ్యలక్ష్మి, మాజీ ఎంపీపీ ఇటంశెట్టి సూర్యభాస్కరరావు తదితరుల ఆధ్వర్యంలో పింఛన్లు అందజేశారు.

జగ్గంపేట(ఆంధ్రజ్యోతి): జగ్గంపేటలో నిర్వహించిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో టీడీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ పాల్గొన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి అర్హులైన లబ్ధిదారులకు ఆయన పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా జ్యోతుల నవీన్ మాట్లాడుతూ పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, జీను మణిబాబు, దేవరపల్లి మూర్తి, పాండ్రంగి రాంబాబు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు(ఆంధ్రజ్యోతి): సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా సీఎం చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ తెలిపారు. మండలంలోని రాచపల్లిలో శనివారం పింఛన్ల పంపిణీ నిర్వహించారు. రాచపల్లిలో జీఎల్ఆర్ ట్యాంక్, హ్యాండ్ బోర్ నిర్మించాలని గ్రామస్థులు కోరారు. రాచపల్లి, లంపకలోవ రహదారిని బీటీగా అభివృద్ధి చేయాలని కోరగా వెంటనే చర్యలు తీసుకుంటామని ఆమె హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అన్నవరం దేవస్థానం పాలక మండలి మాజీ సభ్యులు బుద్ధరాజు గోపిరాజు, కూటమి నాయకులు యాళ్ల జగదీష్, పెదిరెడ్డి నాగు, సారిపల్లి లోకేష్, దంతులూరి నారాయణ బాబు రాజు, డేగల అర్జున బత్తుల భాస్కర్, నారిపిరెడ్డి చక్రి, కారె రామకృష్ణ, పెదిరెడ్డి బాబి, మూరా అప్పారావు పాల్గొన్నారు.

తుఫాన్ బాధితులకు సరుకుల పంపిణీ వాయిదా



కత్తిపూడిలో పంపిణీకి ఏర్పాటు చేసిన సమావేశం

శంఖవరం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): కత్తిపూడిలో తుఫాన్ బాధితులకు బియ్యం, ఆర్థికంగా సహాయాన్ని అందించే కార్యక్రమాన్ని వాయిదా వేసినట్లు రైల్వే వినియోగదారుల సభ్యుడు గొర్లి నాగేశ్వరరావు తెలిపారు. శనివారం పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేసేందుకు సిద్ధపడగా స్థానిక నేతలు తీవ్రమైన అభ్యంతరం తెలిపినట్లు ఆయన ఆరోపించారు. ఇరువర్గాల మధ్య గొడవలు పెరగకుండా పోలీసులు అందరినీ పంపివేశారని, త్వరలోనే లబ్ధిదారులకు సాయం పంపిణీ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో నల్లల రామకృష్ణ, మేకల కృష్ణ, పోలం వెంకటరత్నం పాల్గొన్నారు.

అరుణాచలేశ్వరుడికి ప్రత్యేక పూజలు

ప్రత్తిపాడు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాచపల్లి అరుణాచలేశ్వర క్షేత్రంలో శనివారం కార్తీక ఏకాదశి పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు విశిష్ట పూజలు చేసి పంచామృత అభిషేకాలు, పంచహారతులు, కుంకుమ పూజలు నిర్వహించారు.



రాచపల్లిలో అరుణాచలేశ్వరుడిడికి హారతి ఇస్తున్న దృశ్యం



తేటగుంటలో ప్రమాద బీమా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే దివ్య

'కార్యకర్తలకు అండగా టీడీపీ'

తుని రూరల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): పార్టీ కోసం అహర్నిశలు శ్రమిస్తున్న కార్యకర్తలకు టీడీపీ అండగా ఉంటుందని ప్రభుత్వ విప్, తుని ఎమ్మెల్యే యనమల దివ్య తెలిపారు. కార్యకర్తల సంక్షేమానికే పార్టీ సంక్షేమ విభాగాన్ని ఏర్పాటు చేసిందని, ఆపదకాలంలో వారి కుటుంబాలను ఆదుకునేందుకు ప్రత్యేకమైన చొరవ తీసుకుంటుందన్నారు. ఇటీవల ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి కుటుంబానికి రూ.5లక్షల బీమా చెక్కును తేటగుంట పార్టీ కార్యాలయంలో అందజేశారు. పార్టీ నాయకుడు యనమల రాజేష్, సి.అబ్బాయి, డి.రాజబాబు, అంకం రెడ్డి రమేష్ ఉన్నారు.

కారు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

గండేపల్లి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలో నీలాద్రిరావుపేట గ్రామ సమీపంలో శనివారం కారు ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. మృతుడు మధ్యప్రదేశ్‌కు చెందిన సంజీవ్ జర్‌గా సమాచారముందని, డీఎల్ఎస్ వాటర్‌లో పనిచేస్తాడని పోలీసులు తెలిపారు. మృతుడి వివరాలు సేకరిస్తున్నామని, మృతదేహం జగ్గంపేట పీహెచ్‌సీ మార్చురీలో ఉందన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

'మహిళల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యం'

తుని రూరల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మహిళల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపుతున్నాయని టీడీపీ పట్టణ అధ్యక్షురాలు కుసుమంచి శోభారాణి తెలిపారు. తుని గాంధీ సత్రంలో ప్రారంభించిన సఖీ సురక్ష కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. మెప్మా ఆధ్వర్యంలో మహిళలకు 16రకాల ఆరోగ్య పరీక్షలు చేయడం ప్రశంసనీయమన్నారు. తుని మున్సిపల్ కమిషనర్ వెంకట్రావు, టీడీపీ నాయకులు ఉన్నారు.

బాధితుడిని పరామర్శించిన రమేష్

జగ్గంపేట, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): జగ్గంపేటలో బీసీ నాయకుడు చింతాడి కృష్ణ(రమణ) ఇటీవలే తేనెటీగల దాడికి గురై ఆస్పత్రిలో చికిత్స పొంది ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. ఆయన్ను జగ్గంపేట జనసేన ఇన్‌చార్జ్ తుమ్మలపల్లి రమేష్ శనివారం పలకరించారు. ఆయన వెంట కురుమల్ల నాగేశ్వరరావు మాదారపు వీరబాబు, సూరిబాబు పాల్గొన్నారు.

గండేపల్లిలో అన్నదానం

గండేపల్లి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): స్థానిక వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రతినెలా మొదటి శనివారం అన్నదానం చేస్తున్నారు. కార్తీకమాసం తొలి ఏకాదశి సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదానంలో జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ హాజరయ్యారు.

వైభవంగా ఆంజనేయస్వామి విగ్రహ పునఃప్రతిష్ఠ



ఆంజనేయస్వామి విగ్రహం వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ

ప్రత్తిపాడు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): చినశంకర్లపూడిలో రూ.50లక్షలతో నిర్మించిన 45 అడుగుల అభయాంజనేయస్వామి విగ్రహ పునఃప్రతిష్ఠ శనివారం వైభవంగా జరిగింది. సగర్ల సంఘం, గ్రామస్తుల సహకారంతో నిర్మించిన ఆలయ గోపురం, అభయ ఆంజనేయ పునఃప్రతిష్ఠలో మాజీ ఉపసర్పంచ్ ఏపూరి శ్రీను దంపతులు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, బీసీవై పార్టీ అధినేత బొడే రామచంద్ర యాదవ్, వైసీపీ నేత ముదునూరి మురళీకృష్ణంరాజు, వైసీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు, బీజేపీ నాయకులు చిలుకూరి రామ్‌కుమార్, కుండల సాయికుమార్ యాదవ్, జనసేన నేతలు బార్లపూడి క్రాంతి, మేడిశెట్టి సూర్యకిరణ్, దాసం శేషారావు, బీసీవై పార్టీ ఇన్‌చార్జ్ గొంప శివకుమార్ పాల్గొన్నారు.

వైభవంగా వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం

ప్రత్తిపాడు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరంలో గోవిందమాంబ సమేత పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. గంగాలమ్మ గుడి సమీపంలో ఉన్న బ్రహ్మంగారి ఆలయం వద్ద వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య స్వామి, అమ్మవార్ల కల్యాణం మేళతాళాలు మంగళ వాయిద్యాలతో కన్నుల పండువగా నిర్వహించారు. గౌరీశంకర్ల ఉత్సవాల్లో భాగంగా స్థానిక కళాకారులు వీరబ్రహ్మేంద్రస్వామి కథా రూపకంగా కళాప్రదర్శన నిర్వహించారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు

తుని రూరల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో ఎస్.అన్నవరంలో ద్వారకా నగర్, శేషాద్రినగర్, కొత్త సూరవరం ఏరియాలో నీరు నిల్వ ఉండడంతో గ్రామ ప్రత్యేకాధికారి, ఎంపీడీవో ప్రత్యేక చొరవ తీసుకుని పారిశుధ్య పనులు ముమ్మరం చేశారు.

'భవన నిర్మాణ సంక్షేమ బోర్డు పథకాలను పునరుద్ధరించాలి'

జగ్గంపేట, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఏపీ బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా రెండో మహాసభలు జగ్గంపేటలో జరిగింది. వినాయక రావులమ్మతల్లి తాపీ మేస్త్రీల సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు బోరా సత్తిబాబు జెండా ఆవిష్కరించి శనివారం ప్రారంభించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దువ్వా శేషుబాబ్జీ సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళులర్పించారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులకు అండగా ఉంటుందన్నారు. అనంతరం నూతన జిల్లా గౌరవ అధ్యక్షుడిగా గడిగట్ల సత్తిబాబు, గౌరవ సలహాదారుగా కరణం విశ్వనాథం, జిల్లా అధ్యక్షుడిగా నిట్ల శ్రీను ఇతర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక దీపోత్సవం

గండేపల్లి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలో కె.నాయకంపల్లి శివాలయం వద్ద కార్తీకమాసం సందర్భంగా మహిళలు శివలింగాకారం, స్వస్తిక్, వెంకటేశ్వరస్వామి రూపం తదితర ఆకారాల్లో కార్తీక దీపాలు వెలిగించారు.

వన సమారాధనలు ఐక్యతకు ప్రతీక

ప్రత్తిపాడు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): వన సమారాధనలతో ప్రజల మధ్య ఐకమత్యం పెరుగుతుందని రాష్ట్ర ఖాదీ బోర్డు డైరెక్టర్ కొమ్ములు కన్నబాబు తెలిపారు. ప్రత్తిపాడులోని నరేంద్రగిరి కొండ వద్ద శనివారం గోకవరపువీధి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్తీక వనసమారాధనలో ఆయన పాల్గొన్నారు.

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

ప్రత్తిపాడు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): తుఫాన్‌తో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ అనుబంధ జిల్లా కిసాన్ మోర్చ అధ్యక్షుడు సింగిల్ దేవి సత్తిరాజు కోరారు. శనివారం వర్షాలకు దెబ్బతిన్న వరిచేలను ఆయన పరిశీలించారు.

ఆకట్టుకున్న ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు

తుని రూరల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ రంగం యువజనోత్సవాల్లో భాగంగా ఫ్యాన్సీ కాంపిటీషన్ ఆకట్టుకుంది. తునిలో రోటరీ క్లబ్ విచిత్ర వేషధారణ సమ్మేళనానికి వేదికగా నిలిచింది. వివిధ పాఠశాలల విద్యార్థులు ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు.

'యాజమాన్య పద్ధతులు పాటించాలి'

తుని రూరల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): అధిక వర్షాలకు దెబ్బతిన్న కూరగాయల పంటలకు యాజమాన్య పద్ధతులు పాటించాలని తుని ఉద్యానవన శాఖాధికారిణి సుజాత తెలిపారు. ఆమె క్షేత్రస్థాయిలో పర్యటించి దెబ్బతిన్న ఉద్యాన పంటలను పరిశీలించి రైతులకు సూచనలు ఇచ్చారు.



ఆర్యవైశ్య కమ్యూనిటీ భవనం శంకుస్థాపనకు ఎమ్మెల్యేను ఆహ్వానిస్తున్న దృశ్యం

కమ్యూనిటీ భవనం శంకుస్థాపనకు ఎమ్మెల్యేకు ఆహ్వానం

గండేపల్లి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): గండేపల్లి ఆర్యవైశ్య కమ్యూనిటీ భవనం శంకుస్థాపనకు హాజరుకావాలని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూను మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వాకచర్ల బాబ్జి ఆధ్వర్యంలో సంఘ సభ్యులు శనివారం ఆహ్వానించారు. ఆర్యవైశ్య వనభోజనాలకు ఆహ్వానం పలికి కమిటీ భవనానికి స్థలం కేటాయించిన ఎమ్మెల్యేతో ఆదివారం శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జల్లూరి ప్రదీప్, మామిడిపాక వెంకటరత్నం, వాకచర్ల బాబ్జి, వెలమాటి కాశీ ఉన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

జగ్గంపేట ఎమ్మెల్యే నెహ్రూ శనివారం ఎస్టీరాజాపురంలోని కంటిపూడి సత్యవతి తనయులు సుబ్బారాయుడు, వెంకట్రావు, సురేష్‌ను పరామర్శించా రు. ఆయన వెంట ఎస్వీఎస్ అప్పలరాజు, పోతుల మోహనరావు, కొత్త కొండబాబు, కందుల చిట్టిబాబు, కంటిపూడి సత్యనారాయణ ఉన్నారు.

సర్పంచ్ అయ్యన్నకు ఘన సత్కారం

కిర్లంపూడి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని తామరాడ సర్పంచ్ తోట అయ్యన్నను తామరాడ బిందు ఆశ్రమం భవానీశంకర్ స్వామి ఆలయంలో శనివారం పెద్దలు, గ్రామస్థులు ఘనంగా సత్కరించారు. ముందుగా ఆయనకు ఆశ్రమ పీఠాధిపతులు తాతాచార్యులు పద్మనాభుని సత్యనారాయణ ఆచార్యులు, శిష్యులు రాంబాబు, కృష్ణ, పెద్దిరెడ్డి లక్ష్మణ్, ఆకుల శ్రీను పూర్ణకుంభ స్వాగతం పలికారు.

'ఆదిత్య'లో విజిలెన్స్‌పై అవగాహన

గండేపల్లి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): సూరంపాలెం ఆదిత్యలో 'విజిలెన్స్ సెన్సిటిజషన్' అనే అవగాహన కార్యక్రమాన్ని ఓఎన్‌జీసీ కాకినాడ వారి ఆధ్వర్యంలో నిర్వహించినట్లు యూనివర్సిటీ ప్రో వైస్ ఛాన్సలర్ ఎం.శ్రీనివాసరెడ్డి, రవి తంగజన్ తెలిపారు. విజిలెన్స్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా విజిలెన్స్-మన భాగస్వామ్య బాధ్యత అనే థీమ్‌తో నిర్వహించారు. ఓఎన్‌జీసీ కాకినాడ చీఫ్ జీఎం భాస్కర్ గంగూలీ, ఇన్‌చార్జి చీఫ్ జీఎం కె.సోమశేఖర్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ బి.సౌజన్య తదితరులుపాల్గొన్నారు.